ఈనాడు
పల్నాడు
శుక్రవారం అక్టోబరు 18, 2024
5

సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ వాయిదా

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. అయిదు జిల్లాల్లో వర్షాల తీవ్రత ఎక్కువగా ఉంది. నీటి ప్రాజెక్టులు, కాల్వల నిర్వహణ పనుల్లో జలవనరులశాఖ నిమగ్నమై ఉన్న నేపథ్యంలో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియను కూటమి ప్రభుత్వం వాయిదా వేసింది. తొలుత ఈ నెల 16న ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసి 24వ తేదీ లోపు పోలింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని భావించారు. వర్షాల నేపథ్యంలో నోటిఫికేషన్ విడుదల వాయిదా పడింది. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ఉన్నతస్థాయి నుంచి జలవనరులశాఖ అధికారులకు సమాచారం అందింది.

నాగార్జున సాగర్‌కు పోటెత్తుతున్న వరద


సాగర్ గేట్ల నుంచి నీటి ప్రవాహం

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: నాగార్జున సాగర్ డ్యాం నాలుగు క్రస్టుగేట్ల ద్వారా 32,400 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణాకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 29,557 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సాగర్ కుడి కాలువకు 8067, ఎడమ కాలువకు 6173, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 2400, లోలెవల్ కెనాల్‌కు 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 78,997 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సాగర్ జలాశయం నుంచి మొత్తం 78,997 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నీటిమట్టం 590.00 అడుగుల వద్ద కొనసాగుతుంది. ఇది 312.0450 టీఎంసీలకు సమానంగా ఉంది.



అలుపెరగని పోరు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 35 సౌత్‌జోన్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. క్రీడాకారులు వివిధ క్రీడాంశాల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అథ్లెటిక్ పోటీల్లో క్రీడాకారిణుల విన్యాసాలు.
- ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే



లాభం మూడింతలు పూయించేలా..

ప్రయోగాత్మకంగా అధిక సాంద్రతతో పత్తి సేద్యం

ఎకరాకు రూ.5 వేల చొప్పున ప్రోత్సాహకం

ప్రధాన వాణిజ్య పంట పత్తి కొన్నాళ్లుగా ఒడిదొడుకులు ఎదుర్కొంటోంది. గులాబీ రంగు పురుగు, చీడపీడలతో పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గడంతో రైతులు సాగుకు వెనుకడుగు వేస్తున్నారు. వాస్తవానికి మిగతా పంటలతో పోల్చినపుడు పత్తి మొక్క అధిక తేమ పరిస్థితి, అధిక వేడి వాతావరణాన్ని తట్టుకునే లక్షణం కలిగి ఉంది. ఇందులో అనుకూల గుణాలను కాపాడుకుంటూ ప్రతికూల అంశాలను అధిగమించి సేద్యాన్ని గిట్టుబాటుగా మార్చడానికి అధిక సాంద్రత విధానం అనే ఒక నూతన ఒరవడికి జాతీయ పత్తి పరిశోధన స్థానం శ్రీకారం చుట్టింది. మొక్కల సంఖ్యను మూడు రెట్లకు పెంచి తద్వారా అధిక దిగుబడి సాధించడం దీని ప్రధాన ఉద్దేశం. ప్రయోగాత్మక సాగుకు ముందుకొచ్చే రైతులకు ఆర్థికసాయం అందించి ప్రోత్సహిస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ఏడాది నుంచి లాంఫాంలోని శ్రీవెంకటేశ్వర పశువైద్యవిశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తి సాగు జరుగుతోంది. నాగ్‌పూర్ కేంద్రంగా పనిచేస్తున్న జాతీయ పత్తి పరిశోధన సంస్థ సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. లామ్ ఫామ్ కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు విత్తనాలు నాటడం నుంచి పత్తి తీసే వరకు వివిధ దశల్లో అవగాహన కల్పిస్తోంది.

ఈనాడు, నరసరావుపేట

సంప్రదాయ సాగు విధానంలో ఎకరాకు 7 వేల పత్తి మొక్కలు ఉంటే అధిక సాంద్రత విధానంలో 20 వేల మొక్కలు సాగు చేస్తారు. ఈ విధానంలో మొక్కల సంఖ్య పెరిగినప్పుడు గాలి, వెలుతురు ప్రసరించక కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం ఏర్పడకుండా మొక్కలు ఎక్కువ ఎత్తు పెరగకుండా రసాయనాలను చల్లుతారు. ఆవసరాన్ని బట్టి పంట కాలంలో 40-45, 55-65 రోజుల వ్యవధిలో రసాయనాలు పిచికారీ చేస్తారు. సారవంతమైన నేలలు, అధిక వర్షపాతం వల్ల మొక్కలు ఎక్కువగా పెరిగితే మూడోసారి కూడా రసాయనాలు చల్లాల్సి ఉంటుంది. దీంతోపాటు 150 రోజులకు పంట పూర్తయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటారు. పశువులు, ట్రాక్టర్లతో అంతరసేద్యం చేయడానికి అనువుగా మధ్యలో ఖాళీ అలాగే ఉంచి వరుసల్లో మాత్రం మొక్కల మధ్య దూరాన్ని తగ్గిస్తారు.


ప్రయోగాత్మకంగా సాగు చేసిన పత్తి పైరు

ఈ పరిజ్ఞానాన్ని ఇప్పుడిప్పుడే రైతుల్లోకి తీసుకెళ్తున్నారు. పత్తి పంట ఐదారు నెలలకు పైగా దీర్ఘకాలికంగా సాగులో ఉంటుంది. ఈక్రమంలో నవంబరు, డిసెంబరు మాసాల్లో సంభవించే అధిక వర్షాలు, తుపాన్లకు చేతికొచ్చిన పంట దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. అధిక సాంద్రత విధానంలో పండించడం వల్ల సాగు సమయం 150 రోజులకు పరిమితం చేయవచ్చు. దీంతో తుపాన్ల నుంచి ఉపశమనం కలుగుతుంది. ఏకపంటగా పత్తిని సాగు చేసే పరిస్థితి నుంచి డిసెంబరులో రెండో పైరుగా శనగ, మొక్కజొన్న, పొగాకు తదితర స్వల్పకాలిక పైర్లను వేసుకోవడానికి అవకాశం ఏర్పడటం కర్షకులకు కలిసివస్తుంది.

రైతుల ఆదాయం పెంచడంలో తోడ్పాటు

రైతుల ఆదాయం పెంచడంలో అధిక సాంద్రత విధానం ఎంతగానో తోడ్పడుతుంది. ప్రస్తుతం పత్తిలో గులాబీ రంగు పురుగు సమస్యగా ఉంది. బీటీ విత్తనాల రాకతో పంటకు 120రోజుల వరకు గులాబీ రంగు పురుగు ఆశించదు. దీనిని దృష్టిలో ఉంచుకుని పంట కాలం తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. అధిక సాంద్రత విధానంలో పంట కాలం తగ్గడంతో పాటు తీతల సంఖ్య కూడా తగ్గుతుంది. ఈ విధానాన్ని ప్రోత్సహించడానికి నాగ్‌పూర్‌లోని జాతీయ పత్తి పరిశోధన స్థానం వారు ఎకరానికి రూ. 5వేలు చొప్పున రైతుకు గరిష్ఠంగా 4 ఎకరాలకు ప్రోత్సాహం ఇస్తున్నారు. ఈ విధానంలో సాగు చేయడానికి 625 ఎకరాల్లో సాగు చేయడానికి రైతులు ముందుకొచ్చారు. నేరుగా వారి ఖాతాల్లోకి ప్రోత్సాహక సొమ్ము జమచేస్తున్నాం. రూ. 31.25 లక్షల సొమ్ము సాగుదారులకు అందుతోంది.
- డాక్టర్ యుగంధర్‌కుమార్, ప్రధాన శాస్త్రవేత్త, కేవీకే

దూడ ఇంట్లోకి వచ్చిందన్న నెపం.. తెదేపా వర్గీయులపై వైకాపా వారి దాడి

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : తెదేపాకు ఓటు వేశామనే కక్షతో దూడ పక్కింట్లోకి వెళ్లిందనే వంకతో వైకాపాకు చెందిన వ్యక్తులు తల్లీ కుమారుడిపై దాడి చేసి గాయపరిచారు. పల్నాడు జిల్లా వినుకొండ మండలంలోని దొండపాడులో గురువారం ఇది జరిగింది. బాధితుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంకుల రాజమ్మ కుమారులు శుభకార్యాలకు విద్యుత్తు, డెకరేషన్ పనులు చేస్తుంటారు. అదే గ్రామానికి చెందిన వారి సామాజిక వర్గం వారంతా వైకాపాకు అనుకూలంగా ఉంటారు. బుధవారం రాత్రి రాజమ్మ దూడ తాడు తెంచుకుని పక్కింటిలోని పల్లపాటి అంజమ్మ ఇంట్లోకి వెళ్లింది. ఉదయాన్నే ఇది చూసి రాజమ్మను అంజమ్మ ప్రశ్నించగా మరోసారి ఇలా జరగదని చెప్పినా వినలేదు. తామంతా వైకాపాలో ఉంటే.. వీరు మాత్రం తెదేపాలో ఉన్నారని, పార్టీ విషయాలు మనసులో ఉంచుకుని ఆమెపై పల్లపాటి అయ్యప్ప, అంజమ్మ, బ్రహ్మం, నాగేంద్రబాబు, శ్రీను, మంగమ్మ, యోగేశ్వరరావు దాడి చేశారు. అదే సమయంలో అక్కడ ఉన్న జయమ్మ కుమారుడు వీరబాబును కొట్టగా చేతివేలు చిట్లింది. బాధితులను కారులో వినుకొండ వైద్యశాలకు తరలిస్తుండగా కారుకు అడ్డంగా నిల్చొని మిమ్మల్ని చంపుతామని బెదిరించారు. బాధితులు వైద్యశాలకు వెళ్లగా వారి ఆటోలను ధ్వంసం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు.


ఆటో అద్దాలు ధ్వంసంపై సీసీ కెమెరాలో నమోదైన దృశ్యం

రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు: ఎస్పీ

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : చిలకలూరిపేట ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను ఎస్పీ కంచి శ్రీనివాసరావు పట్టణ, గ్రామీణ సీఐలు పి.రమేష్‌బాబు, సుబ్బానాయుడుతో కలిసి గురువారం పరిశీలించారు. పట్టణంలో పాత పశువుల సంత, కోంద్రుపాడు, ఏఎంజీ చెక్‌పోస్టు, బస్టాండ్, ఎన్ఆర్‌టీ సెంటర్, మండల పరిధిలోని పసుమర్రు, కావూరు, లింగంగుంట్ల, బొప్పూడి ప్రాంతాలు చూశారు. ప్రమాదాలకు కారణాలు ఆరా తీశారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. ఎస్.బి. సీఐ బండారు సురేష్‌బాబు, అర్బన్, రూరల్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.


రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు, పక్కన సీఐలు

జిల్లాలో 312.2 మి.మీ. వర్షపాతం


మిరప పైరులో నిలిచిన నీరు

నరసరావుపేట వ్యవసాయం. న్యూస్‌టుడే : బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా 312.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిరప పొలాల్లో అక్కడక్కడ వర్షపునీరు నిలిచి ఆకులు ఎర్రగా మారుతున్నాయని అన్నదాతలు తెలిపారు. నిత్యం ఏదో ఒక సమయంలో వర్షం పడటంతో తేమశాతం అధికమై మొక్కలు ఉరకెత్తి పోతాయని కర్షకులు తెలిపారు. జిల్లాలోని 28 మండలాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షం పడింది. మండలాల వారీగా వివరాలు ఇలా.. అత్యధికంగా పెదకూరపాడులో 38.4 మి.మీ. వర్షపాతం నమోదు అయింది. మాచర్ల 7.2 మి.మీ, వెల్దుర్తి 4.0, దుర్గి 10.2, రెంటచింతల 20.2, గురజాల 1.6, దాచేపల్లి 2.2, కారంపూడి 5.4, పిడుగురాళ్ల 15.0, మాచవరం 10.8, బెల్లంకొండ 15.8, అచ్చంపేట 6.8, క్రోసూరు 8.6, అమరావతి 5.0, సత్తెనపల్లి 11.8, రాజుపాలెం 14.4, నకరికల్లు 8.6, బొల్లాపల్లి 24.6, వినుకొండ 6.2, నూజండ్ల 8.8, శావల్యాపురం 5.0, ఈపూరు 17.6, రొంపిచర్ల 17.6, నరసరావుపేట 5.8, ముపాళ్ల 8.0, నాదెండ్ల 5.0, చిలకలూరిపేట 17.8, యడ్లపాడు 9.8 మి.మీ.

రైల్వే గేటు కష్టాలకు మోక్షం

రెండు ఆర్వోబీలకు రూ.127 కోట్లు మంజూరు

ఈనాడు, నరసరావుపేట



రైల్వే మార్గంపై వంతెనల నిర్మాణం కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న జిల్లా వాసులకు ఊరట లభించింది. గుంటూరు-నడికూడి మార్గంలో రైళ్ల రాకపోకల సంఖ్య పెరగడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడి తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ)లు నిర్మించాలని ఏళ్లుగా వినతులు చేస్తూనే ఉన్నారు. పల్నాడు ప్రాంతం నుంచి ప్రజాప్రతినిధులు గత ఐదేళ్ల వైకాపా పాలనలో పట్టించుకోకపోవడంతో వంతెనల నిర్మాణం అటకెక్కింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైల్వేగేట్ల వద్ద ప్రజలు పడుతున్న ఇబ్బందులు గుర్తించిన ప్రజాప్రతినిధులు కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించడంలో సఫలీకృతులయ్యారు. నరసరావుపేట ఎంపీ లావుశ్రీకృష్ణదేవరాయలు చొరవ తీసుకుని ఆర్వోబీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా నిధులు మంజూరు చేసిన కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌కు **ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు** ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. రెండు ఆర్వోబీల నిర్మాణం పూర్తయితే ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తొలగిపోతాయని ఎంపీ ప్రస్తావించారు.



శంకుస్థాపన చేసినా ఐదేళ్లుగా పట్టలేదు: సత్తెనపల్లి పట్టణం విస్తరించడంతో అచ్చంపేట రోడ్డులో రైల్వే మార్గం అవతల కూడా కాలనీలు వచ్చాయి. పట్టణం నుంచి కాలనీలకు వెళ్లాలన్నా... అటు నుంచి పట్టణంలోకి రావాలన్నా రైల్వేగేటు దాటుకుని రావాల్సి వస్తోంది. ఈక్రమంలో గేటు పడితే 20 నిమిషాల సమయం వేచిచూడాల్సి వస్తోంది. రైలు వెళ్లిన తర్వాత ట్రాఫిక్ క్లియర్ కావడానికి చాలా సమయం పడుతోంది. దశాబ్దాలుగా రైల్వే వంతెన నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. సత్తెనపల్లి నుంచి అచ్చంపేట, క్రోసూరు తదితర మండలాలకు రాకపోకలు సాగించేవారు గేటు గోడు పడలేక ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈనేపథ్యంలో 2019 జనవరిలో ఆర్వోబీ నిర్మాణానికి అప్పటి సీఎం చంద్రబాబునాయుడు శంకుస్థాపన సైతం చేశారు అయితే అధికారంలోకి వచ్చిన వైకాపా మూలన పడేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ ఆర్వోబీ నిర్మాణంలో కదలిక వచ్చింది.

రైల్వేశాఖ నుంచి నిధులు..

గుంటూరు-నడికూడి సెక్షన్‌లో సత్తెనపల్లి-రెడ్డిగూడెం స్టేషన్ల మధ్య ఎల్‌సీ నంబరు 40 వద్ద రెండు వరుసల ఆర్వోబీ నిర్మాణానికి రూ. 57,13,73,000 మంజూరు చేశారు. గుంటూరు-నడికూడి రైల్వేమార్గంలో తుమ్మలచెరువు-నడికూడి స్టేషన్ల మధ్య ఎల్‌సీ నంబరు 81 వద్ద రెండు వరుసల ఆర్వోబీ నిర్మాణానికి రూ. 70,49,57,000 మంజూరుచేశారు. రెండు వంతెనల నిర్మాణానికి రూ. 127,63,30,000 మంజూరు చేస్తూ ఈనెల 14న రైల్వేశాఖ సికింద్రాబాద్‌లోని జనరల్ మేనేజర్‌కు పంపింది. వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరైనందున సవివర ప్రాజెక్టు నివేదిక తయారుచేసి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నారు.

కారంపూడికి సులువుగా రాకపోకలు

గుంటూరు-నడికూడి రైలు మార్గంలో దాచేపల్లి నుంచి కారంపూడికి వెళ్లే రహదారిలో రైల్వే గేటు ఉంది. దాచేపల్లి నుంచి కారంపూడికి రాకపోకలు సాగించేవారు, సిమెంట్, కంకర, సున్నం తయారీ ముడి పదార్థాలు, వ్యవసాయ ఉత్పత్తులు తరలింపునకు రైల్వేగేటు ప్రధాన అడ్డంకిగా ఉంది. గేటు మూసిన ప్రతిసారి రెండువైపులా వాహనాలు బారులుదీరుతున్నాయి. కొన్నేళ్లుగా ఇక్కడ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఎప్పటికప్పుడు కాలయాపన చేయడం మినహా నిర్మాణాత్మక అడుగులు పడలేదు. ఇక్కడ ఆర్వోబీ నిర్మాణానికి తాజాగా కేంద్రం రూ. 70.49 కోట్ల నిధులు మంజూరు చేయడంతో కొన్నేళ్ల సమస్యకు పరిష్కారం లభించింది. ఈ రెండు ఆర్వోబీల నిర్మాణం పూర్తయితే ఆయా మార్గాల్లో రాకపోకలకు అడ్డంకులు తొలగి సౌకర్యం మెరుగుపడుతుంది. కేంద్ర రైల్వేశాఖ నిధులు మంజూరు చేయడంతో పాటు వంద శాతం నిధులు కేంద్రం వెచ్చించడం వల్ల వీలైనంత తొందరగా పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. ఈమేరకు త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నారు.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం


వెంకటేశ్వర్లు నాయక్ (పాతచిత్రం)

కొండూరు (అచ్చంపేట) న్యూస్‌టుడే: అప్పులు బాధ తాళలేక రైతు తన పొలంలో పురుగు మందు తాగి బలవన్మరణం పొందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. అచ్చంపేట మండలం కొండూరు పంచాయతీ పరిధిలోని శ్రీనివాసతండాకు చెందిన కేతావత్ వెంకటేశ్వర్లునాయక్(44)తన అన్నదమ్ములకు ఉన్న రెండు ఎకరాలు, కౌలుకు మరో రెండు ఎకరాలు సాగు చేస్తున్నాడు. రెండేళ్ల నుంచి పొలంలో పంటల దిగుబడులు లేకపోవడం, ఈ ఏడాది పత్తి, మిరప పైర్లు వర్షాలకు దెబ్బతిన్నాయి. దీంతో రూ. 12 లక్షలు అప్పులు అయ్యాయి. ఈ దిగులుతో బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాకపోవటంతో భార్య అంజమ్మ బంధువుల ఇళ్లలో విచారించింది. అనంతరం గురువారం ఉదయం తమ పొలంలో గ్రామస్థుల సాయంతో పొలంలోని వేపచెట్టు వద్ద మృతదేహాన్ని గుర్తించారు. పక్కనే పురుగుమందు డబ్బా ఫోన్ ఉన్నాయి. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీ.ఐ వెంకటప్రసాద్ పేర్కొన్నారు.


అసైన్డ్ రైతులకు కౌలు జమ



* తొలి విడతగా రూ. 22.03 కోట్లు
* వైకాపా హయాంలో మూడేళ్ల పాటు పెండింగ్

ఈనాడు, అమరావతి

రాజధానిలోని అసైన్డ్ రైతుల బ్యాంకు ఖాతాల్లో వార్షిక కౌలు జమైంది. సీఐడీ క్లియరెన్సు ఇచ్చిన రైతుల వివరాలు పరిశీలించి.. ఇప్పటికే సీఆర్డీఏ అధికారులు సీఎఫ్ఎంఎస్‌లోకి బిల్లులను అప్‌లోడ్ చేశారు. గత మూడేళ్లుగా వైకాపా సర్కారు కారణంగా కౌలు రాక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో మూడేళ్ల కౌలు పడడంతో ఊరట లభించింది. సీఐడీ విచారణ పేరుతో జగన్ ప్రభుత్వం అసైన్డ్ రైతులకు కౌలు నిలిపేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. అసైన్డ్ రైతుల సమస్యలను పరిష్కరించాలని సీఆర్డీఏ అధికారులకు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మొదటి విడతలో ఇటీవల పలువురు అర్హులను గుర్తించి వారికి మంజూరు చేశారు. మిగిలిన వాటిని కూడా పరిశీలించి వచ్చే రెండు, మూడు నెలల్లో పరిష్కరించి న్యాయం చేయాలన్న పట్టుదలతో ఉన్నట్లు సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ తెలిపారు.



మూడేళ్లు నరకం అనుభవించారు: రాజధానిలో భూముల విషయంలో కుంభకోణం జరిగిందని వైకాపా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. 2014 - 19 మధ్య కాలంలో జరిగిన అసైన్డ్ భూముల లావాదేవీలపై విచారణ చేస్తోంది. ఈ నేపథ్యంలో అప్పటి వైకాపా ప్రభుత్వం 2021 నుంచి అసైన్డ్ రైతులకు కౌలు నిలిపేసింది. రాజధాని నిర్మాణం కోసం సమీకరణ కింద వచ్చిన భూముల్లో ఆరు విభాగాలకు చెందిన 3 వేల మందికి సంబంధించి 2,689.14 ఎకరాల మేర అసైన్డ్ భూములున్నాయి. దర్యాప్తు ఇప్పటికే చాలా వరకు పూర్తయినా, మళ్లీ సీఐడీ అధికారులు తిరగదోడారు. దీనివల్ల జగన్ హయాంలో ఎస్సీ రైతులకు జీవనాధారం కరవైంది. కౌలు ఎప్పుడు వేస్తారోనని కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూశారు.

1,234 రైతులకు మంజూరు

సమస్యలు లేని అసలు పత్రాలతో సరిపోలిన 1,479 అసైన్డ్ రైతుల వివరాలను గుంటూరు కలెక్టర్ కార్యాలయం నుంచి సీఆర్డీఏ సేకరించింది. అధికారులు అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి 1, 2, 3 కేటగిరీల్లో వివాదాల్లేని 1,328.17 ఎకరాలకు సంబంధించి 1,234 మంది అసైన్డ్ రైతులను అర్హులుగా గుర్తించారు. వీరిని కౌలు చెల్లింపునకు అర్హులుగా గుర్తించి, జమ చేస్తున్నట్లు సీఐడీ, గుంటూరు కలెక్టర్, ప్రభుత్వానికి సీఆర్డీఏ అధికారులు సమాచారం ఇచ్చారు. వారి నుంచి ఎన్వోసీలు తీసుకున్నారు. వీరికి సంబంధించి రూ. 22.03 కోట్లకు బిల్లులను ఇటీవల సీఎఫ్ఎంఎస్‌లోకి అప్‌లోడ్ చేశారు. ఇది ఆర్థిక శాఖ ఆమోదం లభించడంతో రైతుల ఖాతాల్లో జమయ్యాయి. సీఐడీ అధికారులు తిరస్కరించిన జాబితాలో ఉన్న మిగిలిన వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు సీఆర్డీఏ అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇవి రెండు, మూడు నెలల్లో కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

3,139 మంది అసైన్డ్ రైతుల్లో కౌలుకు అర్హులంటూ 2,472 మందిని గుర్తించారు. వారికీ కూడా కౌలు ఇవ్వకుండా ప్రభుత్వం పక్కన పెట్టేసింది.

ఇసుక రీచ్‌ల పరిశీలన


అంబడిపూడి ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న జేసీ గనోరే, ఆర్డీవో రమణకాంతరెడ్డి, తహసీల్దారు శ్రీనివాస్

అచ్చంపేట, న్యూస్‌టుడే: మండలంలో ప్రతిపాదిత ఇసుక రీచ్‌లను జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, సత్తెనపల్లి ఆర్డీవో రమణా కాంత్‌రెడ్డితో కలసి గురువారం పరిశీలించారు. అంబడిపూడి1, 2, 3 కోనూరు ఇసుక రీచ్‌ల నుంచి స్టాక్ పాయింట్లకు ఇసుక తరలించేందుకు రహదారి సౌకర్యాలు, రవాణాలో ఇబ్బందులు ఉన్నాయా అని తహసీల్దార్ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. నాలుగు రీచ్‌లలోని 13 ఎకరాల్లో పట్టా భూముల్లో స్టాక్ పాయింట్ల ఏర్పాటును తహసీల్దారు జేసీకి వివరించారు. త్వరలో ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక తవ్వకాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఒక్కొక్క ఇసుక రీచ్ నుంచి సుమారు 50వేల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలకు అనుమతులు వచ్చాయని తహసీల్దార్ వారి వెంట డీటీ జానీబాషా, వీఆర్వోలు శేషయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.

పౌరసరఫరాల గోదాములు ఆకస్మిక తనిఖీ: క్రోసూరు, పెదకూరపాడులలోని పౌరసరఫరాల గోదాములను సంయుక్త కలెక్టర్ సూరజ్ గనోరే గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాములలోని నిత్యావసర సరకులు నిల్వలు పరిశీలించారు. బియ్యం, పంచదార, అంగన్‌వాడీలకు సరఫరా చేసే పామాయిల్ నిల్వల రికార్డులను పరిశీలించారు.

మా డబ్బులు ఇస్తారా? లేదా?

★ మద్యం దుకాణాలు ఇప్పిస్తానని ఓ నేత వసూళ్లు

★ తీరా లాటరీ ముగిశాక మొహం చాటేయడంతో ఆశావహుల ఆగ్రహం

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

నరసరావుపేట పట్టణం, మండల పరిధిలో మద్యం దుకాణాలు ఇప్పిస్తానని, ఒక్కొక్కరి నుంచి సుమారు తన వాటాగా ఓ తెదేపా నేత రూ.7.50 లక్షలు వసూలు చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇప్పుడా ఆశావహులంతా దుకాణాలు దక్కకపోవడంతో మా డబ్బు మాకిస్తారా? లేదా? అంటూ నిలదీస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేకు నమ్మిన బంటులా ఉంటూ ఈ మధ్య అన్ని పనులను చక్కబెడుతున్న ఓ కళాశాల అధిపతి మద్యం దుకాణాల పేరిట భారీ మొత్తంలో సొమ్ము చేసుకున్నట్లు తెలిసింది. లాటరీకి ముందే ఈ తంతు నడిపారు. లాటరీ డ్రా రోజు కేవలం మద్యం సిండికేట్ వ్యాపారులకే దుకాణాలన్నీ దక్కడంతో ఎమ్మెల్యే వర్గం అవాక్కయింది. చేసేది లేక ఎలాగైనా కొన్ని దుకాణాలు అయినా తమ వారికి ఇప్పించేలా మంతనాలు నడిపినా పని కాలేదు. దీంతో పోలీసుల నుంచి నరుక్కురావాలని చూసినా వీలు కాలేదు. దుకాణాలు ఇప్పిస్తానని కొందరు ఎమ్మెల్యే వద్ద ఉండే ఓ నేతకు ముందస్తుగా కొంత ముట్టజెప్పారు. తీరా మూడు రోజులవుతున్నా ఏదీ తేలక తాము ఇచ్చిన రూ.7.50 లక్షలు వెనక్కి ఇస్తారా? లేదా? అంటూ ఆ నేత చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు దుకాణాలు దక్కించుకున్న వారి నుంచి ఇదే నేత 75 శాతం వాటా తమ వారికి ఇవ్వాలని బెదిరింపులకు దిగుతున్నారు. తాము లాటరీలో దుకాణం దక్కించుకున్నామని, అలా ఎలా కుదురుతుందని, తామూ తెదేపా కార్యకర్తలమేనని, అవసరమైతే దుకాణం ముందే టెంట్ వేసుకుని నిరాహార దీక్షలు చేపడతామని వారు హెచ్చరిస్తున్నారు.

పేర్లున్నాయ్.. కాలువలే లేవు

★ గ్రామాలకు చేరని పసుమర్రు, తుర్లపాడు మేజర్లు ★ వాగులు పారితేనే పంటలు పండేది

నాగార్జున సాగర్ నిర్మాణ దశలో చిలకలూరిపేట ప్రాంతానికి రావాల్సిన కాలువలు అప్పటి పొగాకు వ్యాపారుల కారణంగా నిలిచాయి. ప్రధానంగా పసుమర్రు మేజర్, తుర్లపాడు మేజర్ గ్రామాల పేరుతో కాలువలు పిలువటానికి ఉన్నాయి తప్ప.. ఆ ప్రాంతానికి కాలువల నిర్మాణం చేయలేదు. గతంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నిలిచిపోయిన పసుమర్రు మేజర్‌ను ఆ గ్రామం వరకు పొడిగిస్తే 40 గ్రామాలకు సాగు, తాగు నీటి ఇబ్బందులు తొలగే అవకాశం ఉంది.



వర్షాలకు ఓగేరువాగులో ప్రవాహం

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే

పసుమర్రు మేజరు పేరుతో ఉన్న కాలువ ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం ఉప్పుమాగులూరు వరకు వచ్చి ఆగిపోయింది. ఆ సమీపంలోనే చిలకలూరిపేట మండలం గోపాళంవారిపాలెం ఉంటుంది. అటు నుంచి రాజాపేట, బొప్పూడి, సమీపంలోనే మురికిపూడి, రామచంద్రాపురం, పసుమర్రు మీదుగా ప్రకాశం జిల్లా పర్చూరు వరకు ఈ కాలువ అప్పట్లో ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాగే తుర్లపాడు మేజరు కాలువ గణపవరం వరకు వచ్చి నిలిచింది.

☛ తరువాత వేలూరు, మానుకొండవారిపాలెం, దండమూడి, కుక్కపల్లివారిపాలెం, గణేశునివారిపాలెం, పంగులూరివారిపాలెం, సందెపూడి, తుర్లపాడు గ్రామాలు ఉన్నాయి. ఇలా రెండు మేజరు కాలువలు సుమారు 40 గ్రామాల పరిధిలో 1.10లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగర్ నీరు ఇవ్వాల్సి ఉన్నా.. అప్పట్లో పొగాకు బాగా పండుతుండటంతో ఈ ప్రాంతంలోని వ్యాపారులు, రాజకీయ నాయకులు తమకు కాలువలు అవసరం లేదని చెప్పారు. దీంతో ఈ గ్రామాల పేరుతో ఉన్న కాలువలు అక్కడకి చేరకుండానే నిలిచిపోయాయి.

☛ ఫలితంగా ఈ ప్రాంత రైతులు ఏటా సాగు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన వాగులైన ఓగేరు, కుప్పగంజి, నక్కవాగులపై ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసుకుని పంటలు వేస్తున్నా ఒక్కొక్కసారి వర్షాలు లేక వాగులు ఒట్టిపోతుండటంతో అతివృష్టి, అనావృష్టి వెంటాడుతూనే ఉంది.

ఇప్పటికైనా పొడిగించాలి



సాగర్ నిర్మాణ దశలో కుడి కాలువ కింద లింగంగుంట్ల సర్కిల్ పరిధిలోని చిలకలూరిపేట ప్రాంతంలో అప్పటి వ్యాపారులు అనాలోచిత నిర్ణయాల ఫలితంగా దశాబ్దాల క్రితం అప్పటి ప్రభుత్వం జీవో 8 ద్వారా సుమారు 1.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటి సౌకర్యాన్ని ఈ ప్రాంత రైతాంగం కోల్పోయింది. సాగర్ నిర్మాణ దశలో అప్పటి వాస్తవ పథకం ప్రకారం తుర్లపాడు, పసుమర్రు మేజరు పొడగించి ఉంటే చిలకలూరిపేట ప్రాంతం అంతటా సాగు, తాగునీటితో పాటు భూగర్భ జలాలు పెరిగి సస్యశ్యామలం అయి ఉండేది. **- ఎం.చిన్నబాబు, గోపాళంవారిపాలెం**

రైతుల కష్టాలు తీరే అవకాశం



ప్రభుత్వం పసుమర్రు, తుర్లపాడు మేజరు కాల్వలు పొడిగిస్తే మా ప్రాంతంలో సాగు, తాగు నీటి ఇబ్బందులు తొలగుతాయి. ఏటా తాగు, సాగు నీటి సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. గతంలో పత్తి, మిర్చి తదితర వాణిజ్య పంటలు సాగు చేసినా నీటి సమస్యతో తీవ్రంగా నష్టపోయాం. వాగులపై ఆధారపడినా ప్రయోజనం లేదు. శనగ పంట పండిస్తున్నా గత ఏడాది తాగునీటి సమస్య తీవ్రతరమైంది. ఇప్పటికైనా మా ప్రాంత రైతుల కష్టాలను గుర్తించి ఆదుకోవాల్సి ఉంది. **- మల్నేని సీతారామయ్య, వేలూరు**

మద్యం దుకాణాల విషయంలో మీ జోక్యం ఎందుకు?

సీఐలను వివరణ కోరిన ఎస్పీ

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

మద్యం దుకాణాలు తెరిచే విషయంలో పోలీసుల జోక్యం ఎందుకు? అని ఎస్పీ కంచి శ్రీనివాసరావు నరసరావుపేట మూడు పోలీస్‌స్టేషన్ల సీఐలను మందలించినట్లు సమాచారం. బార్ అండ్ రెస్టారెంట్ల సిబ్బందిని పోలీసుస్టేషన్‌కు పిలిచి వేధింపులకు గురి చేయాల్సిన అవసరం ఏం వచ్చిందని వివరణ కోరినట్లు తెలిసింది. 'ఎమ్మెల్యేను కలుస్తారా? లేదా?' శీర్షికన గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. నరసరావుపేట గ్రామీణ, వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ల సీఐలను పిలిపించుకుని వారితో మాట్లాడినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఎమ్మెల్యేలు, మద్యం దుకాణాలకు సంబంధించి సెటిల్‌మెంట్ వ్యవహారంలో మీరు తల దూర్చవద్దని తీవ్రంగా హెచ్చరించినట్లు తెలిసింది.

ఈనాడు కథనానికి స్పందన

భవనాలు లేక మద్యం వ్యాపారులకు అగచాట్లు

ఇంకా తెరచుకోని 20 దుకాణాలు

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే: లక్కీ లాటరీలో అవకాశం దక్కించుకున్న వ్యాపారులు ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు అగచాట్లు పడుతున్నారు. వారం వరకు తాత్కాలికంగా వ్యాపారం చేసుకునేందుకు అనుకూల ప్రదేశాలను అన్వేషిస్తున్నారు. ఇప్పటికిప్పుడు లైసెన్స్‌దారులకు దుకాణాలు అద్దెకు లభించడం లేదు. రద్దీగా ఉన్న పట్టణ ప్రాంతాల్లో భవనాలు, ఖాళీ జాగా లభించడం కష్టమవుతోంది. కొన్ని చోట్ల మూతబడిన ప్రభుత్వ దుకాణాల్లోనే ప్రైవేటు దుకాణాలు నిర్వహించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే వాటిల్లో మద్యం నిల్వలు, సామాగ్రిని అధికారులు ఖాళీ చేయకపోవడంతో తల పట్టుకుంటున్నారు. జిల్లాలోని మొత్తం 129 దుకాణాల్లో రెండ్రోజులుగా 109 ప్రైవేటు దుకాణాలు తెరిచారు. మరో 20 ఏర్పాటు చేయాల్సి ఉందని అధికారులు గురువారం తెలిపారు.



నరసరావుపేట డిపో నుంచి ప్రైవేటు దుకాణాలకు తరలిస్తున్న మద్యం

సెపక్‌తక్రా జిల్లా జట్ల ఎంపిక

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ మహిళలు, పురుషుల జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి మండలం నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగాయి. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వడ్డెంపూడి పవన్‌కుమార్ క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని వివరించారు. పాఠశాల హెచ్ఎం కె.శ్రీనివాసరావు, ప్రగతి కళాశాల ప్రిన్సిపల్ రావిపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పురుషుల జిల్లా జట్టు: కె.ఐజక్, షేక్ షరీఫ్, జె.సుధాకర్, కె.కోటేశ్వరరావు, పి.నవీన్, స్టాండ్‌బైలుగా కె.నాగరాజు, ఎం.వంశీ.

మహిళల జిల్లా జట్టు: ఎం.అమూల్య, ఎ.మానస, ఎస్.సునీత, సయ్యద్ అఫ్రోజ్, జి.లలితశ్రీ, స్టాండ్‌బైలుగా ఎం.శ్రీలక్ష్మి, కె.ప్రశాంతి.



ఎంపికైన జట్లతో ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు

ఈపూరు వైద్యశాల సూపరింటెండెంట్ ఆత్మహత్యాయత్నం

ఉన్నతాధికారుల ఒత్తిడి వల్లేనని వెల్లడి

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: వైద్యశాలలో సిబ్బంది సహకరించక పోవడంతో పాటు జిల్లా అధికారులు నుంచి తీవ్ర ఒత్తిడి ఎక్కువై ఈపూరు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కమలాకరరావు గురువారం నిద్రమాత్రలు మింగి ఈపూరు వైద్యశాలలోనే ఆత్మహత్యాయత్నం చేశారు. ఆయన వివరాల మేరకు.. రెండేళ్ల క్రితం ఈపూరులో ఆయన విధుల్లో చేరారు. ఈ ఏడాది మార్చిలో డ్రాయింగ్ పవర్ ఇవ్వగా తనకు దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నాయని, వద్దని చెప్పినా సీనియర్ కనుక తప్పదని ఒప్పించారన్నారు. వైద్యశాలలో పనిచేసే ఆరోగ్యశ్రీ డీఈవో నెలకు రూ.20 వేలు చొప్పున 5 నెలలకు రూ.లక్ష వేతనానికి సంబంధించి దస్త్రం తేగా రూ.లక్షకు చెక్కు ఇచ్చినట్లు తెలిపారు. మిగిలిన సిబ్బంది ద్వారా అతనికి నెలకు రూ.15 వేలు వేతనం అని తెలియగా ఎక్కువ ఇచ్చిన డబ్బులు ఆరోగ్యశ్రీ ఖాతాలో జమ చేసి, మోసం చేసినట్లు క్షమాపణ రాసివ్వాలని తాను కోరానన్నారు. జిల్లా కో- ఆర్డినేటర్ (డీసీహెచ్ఎస్) తనకు బంధువు అని, నేను నగదు చెల్లించనని ఆయన చెప్పినట్లు తెలిపారు. డీసీహెచ్ఎస్ రంగారావు వైద్యశాల తనిఖీ పేరుతో వచ్చి ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. పెయింట్ పెచ్చులు ఊడిన విషయాన్ని కూడా పట్టుకుని తప్పు పట్టారని, దీన్ని ఆసరాగా చేసుకుని దారి ఖర్చులు ఉన్నాయని రూ.7 వేలు పంపాలని కోరగా ఎల్‌డీసీకి నగదు పంపగా అతను డీసీహెచ్ఎస్‌కి పంపినట్లు పేర్కొన్నారు. ఈ విషయం బయటకు పొక్కగా తిరిగి తనకు నగదు పంపారని పేర్కొన్నారు. త్వరలో తన కుమార్తె వివాహం ఉందని, దీనికి తోడు సిబ్బంది సహకరించకపోగా ఉన్నతాధికారుల నుంచి వేధింపులు ఎక్కువై మానసిక ఆందోళనకు గురై ఆత్మహత్యాయత్నం చేసినట్లు వివరించారు. వెంటనే అక్కడున్న సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలిసి బాధితుడిని డీసీహెచ్ఎస్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై వైద్యశాల సూపరింటెండెంట్ అబ్దుల్ రజాక్‌ను అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి ప్రమాదం లేదని ఆయన చెప్పారు.



చికిత్స పొందుతున్న సూపరింటెండెంట్ కమలాకరరావు

బెదిరించడానికే..

వైద్యశాలలో పనిచేసే డీఈవోకి ఇచ్చిన వేతనానికి సంబంధించి నెలకు రూ.5 వేలు చొప్పున అదనంగా ఇవ్వడంతో వాటిని తిరిగి చెల్లించి, క్షమాపణ పత్రం రాయమని కమలాకరరావు కోరారు. దీనికి డీఈవో అంగీకరించలేదని.. సిబ్బందిని బెదిరించడానికే ఆయన ఇదంతా చేశారు. **-రంగారావు, డీసీహెచ్ఎస్, పల్నాడు జిల్లా**

రామాయణాన్ని లోకానికి తెలిపిన మహర్షి వాల్మీకి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: రామాయణాన్ని లోకానికి పరిచయం చేసిన మహర్షి వాల్మీకి అని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాముని జీవితం, అనుసరించిన విలువలు, కుటుంబ బంధాలు, పాలనా సూత్రాలు, సమాజ శ్రేయస్సు తదితర అంశాలను వాల్మీకి 24 వేల శ్లోకాల్లో వివరించారన్నారు. ఆయన జయంతిని రాష్ట్ర పండగగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జ్ఞానం ఒకరి సొత్తు కాదని.. కృషి ఉంటే మనుషులు రుషులవుతారన్న అంశానికి వాల్మీకి మహర్షి జీవితం నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వినాయకం, అధికారులు, వాల్మీకి సంఘ నేతలు పాల్గొన్నారు.

నరసరావుపేట టౌన్: మహా కావ్యం రామాయణాన్ని రచించిన మహర్షి వాల్మీకి బోధనలు అందరికీ ఆదర్శమని ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. నరసరావుపేట జిల్లా పోలీసు కార్యాలయంలో వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి ఎస్పీ నివాళి అర్పించారు. ఆయన ఆశయాలు అందరూ స్మరించుకుంటూ సన్మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) సంతోష్, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటం వద్ద కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు



నివాళి అర్పిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా చంద్రబాబు పాలన

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నెలకొన్న క్లిష్ట పరిస్థితులను అధిగమించి అభివృద్ధి లక్ష్యంగా చంద్రబాబు పాలన సాగుతోందని తెదేపా జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.3 వేల కోట్లు రంగులకు, రూ.700 కోట్లు సర్వేరాళ్లకు ఖర్చు చేయగా.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రూ.4500 కోట్లతో 30 వేల అభివృద్ధి పనులు చేపట్టి పల్లె పండగ నిర్వహిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి కల్పించేందుకు భారీగా పెట్టుబడులు సాధించి పరిశ్రమలు ఏర్పాటు చేసి బంగారు భవిష్యత్తు ఇచ్చేందుకు పునాది వేశారన్నారు. సూపర్-6 పథకాల్లో ఒకటైన ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చే పథకం దీపావళి నుంచి అమలు చేస్తారని తెలిపారు.

వరద బాధితులకు విద్యార్థుల వితరణ

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితులకు విద్యార్థులు సేకరించిన విరాళాన్ని గురువారం కలెక్టర్ అరుణ్‌బాబుకు అందజేశారు. శంకరభారతీపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూ.42 వేలు సేకరించారు. విరాళాన్ని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి చెక్కు అందజేశారు. ప్రధానోపాధ్యాయిని పార్వతి, ఎన్‌సీసీ అధికారి ఫాతిమా, స్కౌట్ శిక్షకులు పమ్మి వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

గండేపల్లి : 14.5 కేజీల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు యువకులను పట్టుకున్నట్లు గండేపల్లి ఎస్సై శివనాగబాబు తెలిపారు. ముందస్తు సమాచారంతో గండేపల్లి శివారు జాతీయ రహదారిపై గురువారం వాహనాలు తనిఖీ చేపట్టారు. జగ్గంపేట నుంచి రాజమహేంద్రవరం వైపు ద్విచక్రవాహనంపై పల్నాడుజిల్లా చిలకలూరిపేటకు చెందిన కేతవత్ స్వామినాయక్, మామిళ్లపల్లి బాల గణేషు గంజాయితో వెళుతున్నారు. వీరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీని విలువ రూ.72,500 ఉంటుందని ఎస్సై పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, 144, 155 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 510 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

అడ్డు తొలగించుకోవాలనే పథకం ప్రకారం దాడి

కత్తితో దాడి చేసిన యువకుడిపై రౌడీషీట్ ❖ మహిళపై దాడి కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : ప్రియురాలితో సహజీవనానికి అడ్డు తొలగించుకోవాలనే పథకం ప్రకారం మహిళపై విచక్షణారహితంగా దాడిచేసిన కేసులో నిందితుడిని, అతడికి సహకరించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎం.హనుమంతరావు చెప్పారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు ఆయన వెల్లడించారు. పట్టణంలోని రంగా కాలనీలో నివాసముంటున్న రావినూతల కరుణ రెండో కుమార్తె భారతికి వివాహమై భర్తతో దూరంగా తల్లిదండ్రుల వద్ద ఉంటుందన్నారు. ఈ క్రమంలో పట్టణంలోని 17వ వార్డు శాలివాహననగర్‌కు చెందిన లైటింగ్ పనిచేసే పొలమాను పూర్ణచంద్రరావు అలియాస్ పూర్ణతో ఆమెకు పరిచయం ఏర్పడి అది కాస్తా సహజీవనంగా మారిందన్నారు. అతడి వేధింపులు భరించలేక భారతి కొంతకాలంగా దూరంగా ఉంటోందన్నారు. తనకు భారతిని దూరం చేస్తోందనే కోపంతో ఐదు నెలల క్రితం కరుణపై రాడ్డుతో పూర్ణచంద్రరావు దాడి చేయడంతో ఆమె చెయ్యి విరిగిందన్నారు. కుమార్తెతో ఉన్న సంబంధం నేపథ్యంలో ఆమె అప్పుడు కేసు పెట్టలేదన్నారు. పెద్దలు ఈ వ్యవహారాన్ని రాజీ చేశారన్నారు. భారతిని కూడా పూర్ణచంద్రరావు కొట్టడంతో చిన్న కుమార్తెను తీసుకుని ఆమె ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిదన్నారు. ప్రియురాలు తనకు దూరం అయ్యేందుకు భారతి తల్లి కరుణయే కారణమని అతడు భావించి ఆమె ఎక్కడుందో చెప్పాలని వేధిస్తున్నాడన్నారు. కరుణపై దాడి చేయాలని పథకం ప్రకారం ఈ నెల 14న స్నేహితుడు, ఆటోడ్రైవర్ పల్లపు అంకమ్మరావుతో కలసి మద్యం తాగి మత్తులో ఆమె ఇంటికి వెళ్లి నిద్రపోతున్న కరుణపై విచక్షణారహితంగా కత్తితో దాడిచేసి గాయపర్చాడన్నారు. కత్తితో వీరంగం చేయడంతో అక్కడివారు భయాందోళనకు గురై రక్తపు మడుగులో పడి ఉన్న ఆమెను కాపాడేందుకు ముందుకు రాలేదన్నారు. ఎస్సై సంధ్యారాణికి అందిన సమాచారంతో ఆమె హుటాహుటిన అక్కడకు వెళ్లి వెంటనే కరుణను ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి గుంటూరుకు తరలించారన్నారు. కరుణ ఆరోగ్య పరిస్థితి ఇప్పటికి విషమంగా ఉందన్నారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ప్రధాన నిందితుడు పూర్ణచంద్రరావుతో పాటు అతడికి నేరంలో సహకరించిన అంకమ్మరావును అరెస్టు చేశామని డీఎస్పీ పేర్కొన్నారు. చట్టప్రకారం పూర్ణచంద్రరావుపై రౌడీషీట్ తెరవబోతున్నట్లు ఆయన తెలిపారు. పట్టణ సీఐ బ్రహ్మయ్య, ఎస్సై సంధ్యారాణి పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హనుమంతరావు వెనుక నిందితులు

రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలు ప్రారంభం

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: రాబోయే ఒలింపిక్స్‌లో జిమ్నాస్టిక్స్ విభాగంలో భారత్ స్వర్ణం సాధించే దిశగా అడుగులు వేయాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించగా.. పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. ఈనెల 19వ తేదీ వరకు పోటీలు కొనసాగనున్నాయి.

మాస్టర్‌మైండ్స్ విద్యార్థినికి సీఎం అభినందన

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: గతంలో విడుదలైన ఆలిండియా సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో మొదటి ర్యాంకు సాధించిన మాస్టర్‌మైండ్స్ విద్యార్థిని కొత్తపేట తేజస్వినిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా మాస్టర్‌మైండ్స్ యాజమాన్యం, సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును కలిసిన విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.7 లక్షలు డీడీని వరదబాధితుల సహాయార్థం అందజేశారు.



తేజస్వినిని అభినందిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్

నరసరావుపేట

• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

రీసర్వే చేసిన గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు

ఈపూరు, వినుకొండ, న్యూస్‌టుడే : నరసరావుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో భూములు రీసర్వే నిర్వహించిన గ్రామాల్లో ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించడానికి శుక్రవారం నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో కె.మధులత తెలిపారు. గురువారం ఈపూరు, వినుకొండ తహసీల్దార్ల కార్యాలయాలను ఆమె తనిఖీ చేసి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో విడివిడిగా సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమల్లో అక్రమాలకు తావు లేకుండా సిబ్బంది పారదర్శకంగా వ్యవహరించాలని.. ప్రజల అర్జీలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. తహసీల్దారు నళిని పాల్గొన్నారు.

వేల్పూరులో నేత్రదానం



రామయ్య (పాత చిత్రం)

శావల్యాపురం, న్యూస్‌టుడే : మండలంలోని వేల్పూరుకు చెందిన కుమ్మరపల్లి రామయ్య (మిల్లు రామయ్య) గురువారం మరణించారు. ఆయన కుటుంబసభ్యులు అమ్మనేత్ర, అవయవ, శరీరదాన ప్రోత్సాహకుల సంఘం పల్నాడు జిల్లా సమన్వయకర్త సంద్రపాటి చలపతిరావుకు నేత్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఆయన పెదకాకాని శంకర కంటి నేత్రాలయం వారికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి కార్నియాలు తీసుకెళ్లారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? నూజండ్ల తూర్పు వీధిలో రోడ్డు లేక వర్షం, మురుగునీరు దారిలో చేరి నడవడానికే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. **-పాపిరెడ్డి**

✔ నిధులు రాగానే సీసీ రోడ్డు నిర్మిస్తాం. ప్రస్తుతం పారిశుద్ధ్య పనులు చేయించి ఇబ్బంది లేకుండా చూస్తాం. **-ప్రభాకర్, కార్యదర్శి**

? ములకలూరు రక్షిత నీటి పథకం పనిచేయక ఆరేళ్లు అవుతోంది. దీంతో ఫ్లోరైడ్ నీరు తాగి రోగాల బారిన పడుతున్నాం. **- ప్రసాద్, కొండలరాయునిపాలెం**

✔ మోటార్లు మరమ్మతులు పూర్తి చేశాం. రక్షిత నీటి చెరువును సాగర్ జలాలతో నింపాం. వారం రోజుల్లో తాగునీరు అందిస్తాం. **- ఆకాష్, ఏఈ, గ్రామీణ నీటి సరఫరా శాఖ**

– న్యూస్‌టుడే, నూజండ్ల

? పట్టణ శివారు ఎస్ఆర్‌కేటీ కాలనీలో గంజాయి తాగుతున్న వారితో శాంతిభద్రతల సమస్య తలెత్తుతోంది. **-కాలనీ పెద్దలు**

✔ గంజాయి తాగే వాళ్లతో పాటు విక్రయించే వారిపై కఠిన చర్య తీసుకుంటాం. **- రామకృష్ణ, సీఐ, నరసరావుపేట గ్రామీణ**

? పట్టణంలోని ఆర్టీసీ గ్యారేజ్ పక్కన ప్రకాష్‌నగర్ వెళ్లే మార్గంలో వర్షాకాలంలో మురుగు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. **-వంశీ చౌదరి**

✔ రోడ్డుకు ఇరువైపులా కాలువల నిర్మాణానికి చర్య తీసుకుంటాం. పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా సిబ్బందితో పర్యవేక్షిస్తాం. **-జస్వంతరావు, పురపాలక సంఘ కమిషనర్**

– న్యూస్‌టుడే, నరసరావుపేట టౌన్

? వెల్లటూరు రోడ్డులోని ద్వారకానగర్‌లో వీధి దీపాల విద్యుత్తు బిల్లులు సొంతంగా చెల్లిస్తున్నాం. అంతర్గత రహదారులు, మురుగు వ్యవస్థ సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నాం. **- భాను, కాలనీవాసి**

? మార్కాపురం రోడ్డులో చెక్‌పోస్టు నుంచి దిగువకు వెళ్లే కాలువ పూడ్చారు. వర్షం వస్తే రోడ్డుపైన పడిన వాన నీరు అంబికానగర్ రెండో లైన్‌లోకి వచ్చి ఇళ్లల్లోకి చేరుతోంది. **-మల్లికార్జునరావు**

✔ ద్వారకానగర్ విద్యుత్తు బిల్లు పురపాలక సంఘం ద్వారా చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. కొద్ది రోజుల నుంచి చెత్త బండి వెళుతోంది. అక్కడ పల్లంలో ఉన్నందున రోడ్డు పక్కన కాల్వ కట్టే ఆలోచనలో ఉన్నాం. **- సుభాష్‌చంద్రబోస్, మున్సిపల్ కమిషనర్, వినుకొండ**

– న్యూస్‌టుడే, వినుకొండ

కాలనీలకు కాంతులు

స్పందనకు వందనం

రొంపిచర్ల, న్యూస్‌టుడే : విప్పర్ల పంచాయతీ పరిధిలోని అంజిబాబు కాలనీ, ఎస్సీకాలనీలో వీధి దీపాలు వెలగటం లేదని 'మేమున్నాం.. మీకు తోడుగా'లో సమస్య ప్రచురితం అయింది. పంచాయతీ కార్యదర్శి స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేశారు.

స్థలం లేదు.. స్థాయి పెరగదు

కొండవీడు యూపీ పాఠశాలకు అదనపు స్థలం కొరత

అందుబాటులోకి రాని అదనపు గదులు, ఆటస్థలం

యడ్లపాడు, న్యూస్‌టుడే

పీఎంశ్రీ పాఠశాలగా, రెండుసార్లు స్వచ్ఛ విద్యాలయంగా ఎంపికైన ఆదర్శవంతమైన ప్రాథమికోన్నత పాఠశాల అది. నాలుగైదు గ్రామాల్లో పేద విద్యార్థులకు విద్య అందిస్తున్న విద్యాలయం. ఉన్నత పాఠశాలగా స్థాయి పెంచటానికి సరిపడా విద్యార్థులు ఉన్నా.. క్రీడా ప్రాంగణం, అదనపు గదుల నిర్మాణానికి స్థలం లేకపోవటం శాపంగా మారాయి.

❖ నాడు- నేడుతో సరిపోల్చటానికి యడ్లపాడు మండలం కొండవీడు ప్రాథమికోన్నత పాఠశాల అచ్చుగుద్దినట్లు సరిపోతుంది. సదరు పాఠశాలకు 2017లో గోరంట్ల శ్రీనివాసరావు ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టారు.



కొండవీడు ప్రాథమికోన్నత పాఠశాల

అప్పటి వరకు మౌలిక వసతుల లేమితో కొట్టుమిట్టాడిన పాఠశాలను హెచ్‌ఎం రూపురేఖలు మార్చారు. ఉపాధ్యాయుల సమష్టి కృషితో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఒక్కొక్కటిగా వసతులు సమకూర్చారు. అధ్వాన స్థితిలో ఉన్న మురుగుదొడ్లకు మరమ్మతులు చేయించారు. స్టేట్‌బ్యాంకు సహకారంతో నీటి శుద్ధి కేంద్రం, విద్యుత్తు, ఫ్యాన్లు ఏర్పాటు చేయించారు. ప్రాంగణంలో ప్రఖ్యాత శాస్త్రవేత్తలు విగ్రహాలు ఏర్పాటు చేయించి.. పాఠశాల భవనానికి రంగులు వేయించారు. చేతరాతలో శిక్షణ, రంగోత్సవ్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల సంఖ్య 180కి పెంచారు. ఇందుకు హెచ్‌ఎం సొంత నిధులు రూ.లక్షల్లో వెచ్చించారు. దీంతో రాష్ట్రస్థాయి స్వచ్ఛ పాఠశాలగా ఇది ఎంపికైంది. మరోసారి జాతీయ స్థాయి స్వచ్ఛ పాఠశాల పోటీల బరిలో నిలిచింది. 2023లో పీఎంశ్రీ పాఠశాలగా ఎంపికైంది. విద్యార్థుల ప్రతిభకు గుర్తింపు వండర్ బుక్ ఆఫ్ రికార్డులో గుర్తింపు దక్కింది.

❖ పాఠశాలను ఉన్నతంగా తీర్చిదిద్దాలని తపించే హెచ్‌ఎంకు ప్రతికూలతలు అడ్డుగా నిలుస్తున్నాయి. పాఠశాలకు అదనపు స్థలం లేక అదనపు గదుల నిర్మాణానికి, క్రీడా మైదానం అభివృద్ధికి మంజూరైన పీఎంశ్రీ నిధులు వెనక్కిపోయాయి. పాఠశాలకు అదనపు స్థలం మంజూరు చేయాలని పలుసార్లు పై అధికారులకు విన్నవించుకున్నా ఫలించలేదు. సరిపడా విద్యార్థులు ఉన్నా.. ఆటస్థలం, అదనపు గదుల కొరతతో ఉన్నత పాఠశాలగా స్థాయి పెంచటానికి నిబంధనలు అడ్డు వస్తున్నాయి. పాఠశాల సమీపంలోని గ్రామకంఠం భూమిని సమకూర్చి ఉన్నత పాఠశాలగా స్థాయి పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

స్థాయి పెరగటానికి స్థలం కావాలి



పిల్లలను చదువు చెప్పే పాఠశాల నాకు దేవాలయంతో సమానం. సొంత నిధులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అభివృద్ధి చేశాను. ఉన్నత పాఠశాలగా మారితే చుట్టుపక్కల గ్రామాల పిల్లలు స్థానికంగా 10వ తరగతి వరకు చదువుకోవచ్చు. వాహనాల్లో ఫిరంగిపురం, సొలస వెళ్లే ప్రయాసలు తప్పుతాయి. ఉన్నత పాఠశాలగా స్థాయి పెరిగితే వ్యక్తిగత సంతృప్తితో పాటు గ్రామస్థుల చిరకాల వాంఛ నెరవేరుతుంది.

– గోరంట్ల శ్రీనివాసరావు, హెచ్‌ఎం, కొండవీడు ప్రాథమికోన్నత పాఠశాల

బాలల హక్కులపై అవగాహన

యడ్లపాడు : మండలంలోని కొండవీడు ప్రాథమికోన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీడీపీవో నిర్మలారాణి మాట్లాడుతూ బాలల హక్కులు, ఆరోగ్యం, బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలు, లైంగిక వేధింపు నివారణ, మంచి, చెడు స్పర్శలు గుర్తించటం తదితర అంశాలను వివరించారు. సమగ్ర బాలల పరిరక్షణ విభాగం (డీసీపీయూ) కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ జోజమ్మ, హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగేవరకు పోరాడతాం

చిలకలూరిపేట పట్టణం : దళిత, గిరిజన రైతులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.గోపాలరావు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద యడవల్లి దళితుల భూములకు సంబంధించి రైతు భూ పోరాట కమిటీ, వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్, సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. యడవల్లి దళిత గిరిజన రైతులు ఏడేళ్లుగా తమ భూముల కోసం న్యాయ పోరాటం చేస్తున్నారని, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వివిధ సంఘాల నాయకులు పేరుబోయిన వెంకటేశ్వర్లు, వి.ముత్తయ్య, బి.శ్రీనునాయక్, బోదాల బాబురావు, అద్దంకి బాబురావు, వెంకట్రావు, సాతులూరి లూథర్, దళిత గిరిజన రైతులు పాల్గొన్నారు.

వీటిని తొలగించే బాధ్యత లేదా?



రోడ్డు మీద వ్యర్థాలు

పట్టణంలోని చెరువు రోడ్డులో ఉన్న 52 ఎకరాల్లోని టిడ్కో గృహ సముదాయంలో రహదారులపై చెల్లాచెదురుగా ఉన్నాయి. వర్షాలకు ఇవి దుర్వాసన వస్తున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు. మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేయాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

సమస్యల పరిష్కారానికి వినతి

చిలకలూరిపేట పట్టణం: స్థానిక 31వ వార్డులో సమస్యలు పరిష్కరించాలని పురపాలక సంఘ కమిషనర్ శ్రీహరిబాబుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నేత రాజా రమేష్ మాట్లాడుతూ బైపాస్ రోడ్డులో గల శ్మశానవాటిక అధ్వానంగా ఉందని, ఇక్కడ షెడ్డు, చేతిపంపు, రహదారి ఏర్పాటు చేయాలని కోరారు. పురుషోత్తపట్నం వాసులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి హల్‌చల్

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట) : నరసరావుపేట ఏరియా వైద్యశాలలో మద్యం మత్తులో ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. ఆసుపత్రి గర్భిణుల వార్డు ప్రాంగణంలో మద్యం తాగవద్దనందుకు మహిళను దుర్భాలాడుతూ వీరంగం సృష్టించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఒకటో పట్టణ పోలీసులు స్టేషన్ తరలించారు.

కాలనీలోకి వెళ్లేదెలా...



బురదమయంగా కాలనీ ప్రధాన రహదారి

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : మండలంలోని ఉప్పలపాడు సమీపంలో పేదల కోసం గత ప్రభుత్వం జగనన్న కాలనీ పేరుతో స్థలాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణం చేపట్టింది. అయితే తాగునీరు, రోడ్లు వేయక చాలామంది ఇళ్లు నిర్మించుకోలేదు. ప్రస్తుతం ఇళ్లు నిర్మించుకున్న వారు వర్షం పడితే కాలనీలోకి వెళ్లలేక, కాలనీ నుంచి బయటకు రాలేని పరిస్థితులు ఉన్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలనీ సమీపంలో ఉన్న వాగు పొంగుతోందని ఆందోళన చెందుతున్నారు. ఇది ఇలాఉంటే కాలనీలో రోడ్లు లేక మట్టి రోడ్లపై నడవాలంటే తీవ్ర ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి రోడ్లు వేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వైద్యశాల ఆవరణ ఇలాగేనా ఉండేది?



ఆరోగ్య కేంద్రంలో వ్యర్థాలు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి రవి

శావల్యాపురం, న్యూస్‌టుడే : ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు వైద్య సేవలు అందించాక వ్యర్థాలు విడిగా వేయాలని, అన్ని ఒకే చోట వేస్తే దుర్గంధం వస్తుందని జిల్లా వైద్యాధికారి రవి సూచించారు. గురువారం శావల్యాపురం ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యాధికారి ఎం.రాధాకృష్ణన్, సిబ్బంది ఉన్నారు.



ఏనుగుపాలెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపనలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మక్కెన, అధికారులు



గోపాళంవారిపాలెంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి, పక్కన నాయకులు

పల్లె పండగ.. అభివృద్ధి నిండుగా..



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే చదలవాడ, గోనుగుంట్ల, నేతలు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : గత వైకాపా పాలనకు.. ఇప్పటి కూటమి ప్రభుత్వ పాలనకు మధ్య తేడా ఏమిటో నాలుగు నెలలుగా చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలే చెబుతున్నాయని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పల్లె పండగలో భాగంగా ఏనుగుపాలెం, పిట్టంబండలో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి గురువారం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సిద్ధి లింగమూర్తి, జనసేన నేత నిశ్శంకరరావు శ్రీనివాసరావు, నేతలు మాదినేని ఆంజనేయులు, మక్కెన కొండలు, వీరగంధం ఆనంద్, ముత్తినేని ఏడుకొండలు, మద్దుకూరి రామబ్రహ్మం పాల్గొన్నారు.

చిలకలూరిపేట పట్టణం, నాదెండ్ల : అధికారులపై జగన్, వైకాపా నాయకులు బ్లాక్‌మెయిల్ రాజకీయాలు దిగుతున్నారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా గురువారం చిలకలూరిపేట మండలం గోపాళంవారిపాలెంలో రూ.కోటితో 4 కిలోమీటర్ల రహదారి, రూ.15 లక్షలతో సీసీ రహదారులు, రోడ్ల నిర్మాణం, నాదెండ్ల మండలం ఎండుగుంపాలెంలో రహదారులకు, కాలువల నిర్మాణ పనులకు భూమి పూజ చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యడ్లపాడు : పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తిమ్మాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి, దింతెనపాడు, కారుచోలలో సీసీ రోడ్లకు తెదేపా నేతలు, అధికారులు గురువారం శంకుస్థాపన చేశారు. నేతలు పాపసాని రాజేశ్వరి, దేవరపు చౌదరి, మునాఫ్, ఎంపీడీవో హేమలతాదేవి, ఈవోపీఆర్డీ జాకీర్ హుస్సేన్, ఉపాధి హామీ పథకం ఏపీవో రామారావు, టీఏ మాధవి పాల్గొన్నారు.

ఈపూరు : పల్లె పండగ కార్యక్రమం ద్వారా గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఈపూరు తెలిపారు. ఈపూరు, భద్రుపాలెం, ఇనుమెళ్లలో అభివృద్ధి పనులకు, ఈపూరులో ఊడిజర్ల రోడ్డు వద్ద బస్‌షెల్టరు నిర్మాణ పనులకు, ఈపూరు, భద్రుపాలెం, ఇనుమెళ్లలో సిమెంటు రోడ్లు, కాల్వల పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో కె.ప్రభాకరరావు, ఈపూరు సర్పంచి పల్లమీసాల చెంచయ్య, తెదేపా నేతలు రాపర్ల మురళీ, బొల్లా సుబ్బారావు, చాపల మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

రొంపిచర్ల : పంచాయతీల పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించామని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. మండలంలోని మాచవరం, కర్లకుంట, కొత్తపల్లిలో గురువారం సీసీ రోడ్లు, కాలువ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు, భాజపా నేత రంగిశెట్టి రామకృష్ణ, తెదేపా మండల అధ్యక్షుడు పులుకూరి జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

నూజండ్ల : పల్లె పండగ కార్యక్రమంతో పల్లెల రూపురేఖలు మారనున్నట్లు ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జడ్పీటీసీ జడ్డా సుబ్బులు అన్నారు. జంగాలపల్లె, త్రిపురాపురాలు, మారెళ్లవారిపాలెం, అప్పాపురంలో కాల్వలు, సీసీ రోడ్లు, మినీ గోకులం షెడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, ఏఈ అల్లాభక్షు, ఏపీవో ఆంజనేయరాజు, సర్పంచులు చిన వెంకటేశ్వర్లు, బ్రహ్మారెడ్డి, రవీంద్ర, బుల్లీశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులున్నారు.

నరసరావుపేట సెంట్రల్ : మండలంలోని చిన్నతురకపాలెం, చింతలపాలెం, గోనెపూడి, గురవాయపాలెంలో ఎమ్మెల్యే అరవిందబాబు సీసీ రోడ్లు, ఇంకుడు గుంతలు, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో కృష్ణకుమారి, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఏఈ జానీబాషా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శావల్యాపురం : మండలంలోని మతుకుమల్లి, ఇర్లపాడులో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు. డీఎల్‌డీవో వెంకటరెడ్డి, ఎంపీడీవో పేరమీన సీతారామయ్య, సర్పంచులు రమాదేవి, బసవయ్య, అధికారులు, తెదేపా నేతలు పాల్గొన్నారు.



విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి, జెస్సీ బర్నాబస్ తదితరులు

ఆదర్శనీయుడు డాక్టర్ జాన్ డేవిడ్

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : కులాలు, మతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన డాక్టర్ జాన్‌డేవిడ్ ఆదర్శనీయుడని ఏఎంజీ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ కంటి మహంతి, ఫార్ కార్నర్స్ డైరెక్టర్ జెస్సీ ఎస్.బర్నాబాస్ అన్నారు. స్థానిక ఏఎంజీ, ఫార్ కార్నర్స్, వేద సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ జాన్ డేవిడ్ జయంతి గురువారం నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బోర్డు సభ్యులు, డాక్టర్ జాన్ సులక్షన్, సాంబయ్య, మెజస్, పీటర్, ప్రసన్న, సత్యంబాబు పాల్గొన్నారు.

తెదేపా నేతల ఫ్లెక్సీ చించివేత

నాదెండ్ల, న్యూస్‌టుడే : ఇర్లపాడు కేంద్రీయ విద్యాలయం వద్ద కనపర్రుకు మెటల్ రహదారి నిర్మాణానికి భూమిపూజ సందర్భంగా ఇటీవల తెదేపా వర్గీయులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చిత్రాలతో ఇది ఏర్పాటు చేయగా మూడ్రోజుల క్రితం చించివేసిన విషయం గురువారం వెలుగుచూసింది. నరసరావుపేట మండలంలోని ఓ వైకాపా గ్రామనేత అనుచరులు ఈ చర్యకు పాల్పడినట్లు చర్చించుకుంటున్నారు. దీనిపై విచారిస్తున్నట్లు ఎస్సై పుల్లారావు తెలిపారు.

19న మెగా జాబ్‌మేళా

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : నిరుద్యోగ యువతకు 19న ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ఉదయం 9 నుంచి మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పుల్లారావు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన, తప్పిన, ఐటీఐ, ఇంటర్ పూర్తయిన వారితో పాటు డిగ్రీ, బీటెక్, ఎంటెక్, పీజీలు, ఫార్మా చదివిన వారంతా హాజరు కావచ్చని ఆయన పేర్కొన్నారు. 30కి పైగా సంస్థలు 1000 ఉద్యోగాలతో హాజరవుతున్నాయని తెలిపారు.

ఉద్యోగులను తొలగించడం అన్యాయం

నరసరావుపేట సెంట్రల్ : విధుల నుంచి తొలగించిన వారిని తిరిగి తీసుకోవాలంటూ మున్సిపల్ ఒప్పంద కార్మికులు, ఉద్యోగులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం మూడో రోజుకు చేరాయి. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్ దీక్షా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఉద్యోగులను, కార్మికులను తొలగించడం సరికాదని చెప్పారు. వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పారిశుద్ధ్య, ఒప్పంద కార్మికులు ర్యాలీగా ఎమ్మెల్యే కార్యాలయం వరకు చేరుకొని తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు చేసి నిరసన తెలిపారు.

యువకుడికి డెంగీ లక్షణాలు

వినుకొండ రూరల్ : వినుకొండ మాస్టిన్ కాలనీకి చెందిన మన్నం నాని నిరుపేద. తల్లిదండ్రులు ఇద్దరూ లేకపోవడంతో బంధువులే బాధ్యతలు చూస్తున్నారు. మూడు రోజులుగా జ్వరం రావడంతో రెండు రోజుల క్రితం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గురువారం పరీక్షల్లో డెంగీగా నిర్ధరణ అయింది. మెరుగైన వైద్యానికి గుంటూరు తరలించారు.

ఇక గుంతలు పూడ్చేస్తారు

ఆర్‌అండ్‌బీ రహదారులకు అత్యవసర మరమ్మతులు

రహదారి గుంతలతో వాహనాలు గుల్లవుతున్నాయి. ఆదమరిస్తే అంతే సంగతులన్న భయంతో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. వైకాపా పాలనలో నిర్లక్ష్యానికి గుర్తుగా పలు రహదారులు ఛిద్రమయ్యాయి. తట్టెడు కంకర పోసి పూడ్చకుండా వదిలేశారు. అధికారంలోకి రాగానే సమస్య గుర్తించిన కూటమి ప్రభుత్వం మరమ్మతులకు నిధులు విడుదల చేసింది. టెండర్లు పిలిచి పనులు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. **- వినుకొండ, న్యూస్‌టుడే**



గుంతల పడిన పొదిలి - కారంపూడి వయా వినుకొండ రోడ్డు

వినుకొండ నియోజకవర్గంలో..

రహదారి పేరు	మంజూరైన నిధులు (రూ.లక్షల్లో)
కొచ్చర్ల– ఏల్చూరు రోడ్డు	36.59
పొదిలి– వినుకొండ	12.13
వినుకొండ– ముప్పరాజుపాలెం	9.27
రేమిడిచర్ల– లాలిపురం	5.53
ఈపూరు– బొమ్మరాజుపల్లె	5.16
నూజండ్ల– నూజండ్ల రింగ్ రోడ్డు	3.99
కొండ్రముట్ల – బండ్లమోటు – దుర్గి	40.31

వాల్మీకి మహర్షికి ఘన నివాళి



చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కమిషనర్ సుభాస్ చంద్రబోస్

వినుకొండ, న్యూస్‌టుడే : వాల్మీకి సిద్ధాంతం ఆయన రామాయణంలో ప్రతిబింబిస్తుందని పురపాలక సంఘ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ అన్నారు. కార్యాలయంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు, తహసీల్దార్ సురేష్, కార్యాలయ సిబ్బంది వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

✦ తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి వాల్మీకి చిత్రపటానికి పూలమాలు వేశారు.

చిలకలూరిపేట పట్టణం : మానవ చరిత్ర ఉన్నంతకాలం మరిచిపోలేని నిత్యస్మరణీయుడు వాల్మీకి మహర్షి అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. వాల్మీకి జయంతి పట్టణంలోని తెదేపా కార్యాలయంలో గురువారం నిర్వహించారు. చిత్రపటానికి పూలదండ వేసి నివాళి అర్పించారు. పురపాలక సంఘ ఛైర్మన్ ఎస్కే రఫాని, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శోకం నుంచి శ్లోకం ఇదే రామాయణగాథకు మూలం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : వాల్మీకి చరిత్ర పరిశీలిస్తే తొలి విషాదశోకం నుంచి శ్లోకం పుట్టి రామాయణ మహాకావ్యానికి మూలమైందని వక్తలు పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయంలో గురువారం శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వక్తలు స్వర్ణ చినరామిరెడ్డి, బత్తుల మురళీ, జిల్లా గ్రంథాలయాధికారిణి వై.రాధ, పరిషత్ సభ్యులు, గ్రంథాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నరసరావుపేట సెంట్రల్: మండలంలోని పెద్దరెడ్డిపాలేనికి చెందిన మార్క్ లక్ష్మయ్య (29) ఈనెల 6న మద్యంలో పురుగుల మందు కలిపి తాగి పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిషోర్ తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసి ఆదరించండి

వినుకొండ : 2025 మార్చిలో జరగనున్న కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదు చేసుకుని తనను ఆదరించాలని స్వతంత్ర అభ్యర్థి లగడపాటి వేణుగోపాల్ తెలిపారు. ఏనుగుపాలెం రోడ్డులోని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యవత, కార్మికులు, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఫిరోజ్, వెంకటేశ్వర్లు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఏపీ ఇవీ

విద్యార్థి నాయకుడి రక్తదానం

వినుకొండ : అత్యధిక సార్లు రక్తదానం చేసి ఇటీవల దిల్లీలో వరల్డ్ హ్యూమన్ రైట్స్ అంతర్జాతీయ సంస్థ ఇచ్చిన గౌరవ డాక్టరేట్ పొందిన పీవీ సురేష్‌ను ఆదర్శంగా తీసుకుని రక్తదానం చేసినట్లు మానవసేవా సమితి సభ్యుడు, విద్యార్థి నాయకుడు ఉమ్మడి వెంకట చంద్రశేఖర్ అన్నారు. వినుకొండలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న మహిళకు ఆయన రక్తదానం చేశారు.

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం భరోసా

నూజండ్ల : వ్యవసాయ రంగానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని మండల వ్యవసాయాధికారి సుగుణా బేగం అన్నారు. నూజండ్ల రైతు సేవా కేంద్రంలో గురువారం ఈ-పంట నమోదుపై సామాజిక తనిఖీ చేపట్టారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం రైతుల తరపున పంటల బీమా సొమ్ము చెల్లించి తోడ్పాటు ఇచ్చినట్లు చెప్పారు. సాగుదారుల ముసాయిదా జాబితాలపై సామాజిక తనిఖీలకు గ్రామసభలు చేపట్టినట్లు తెలిపారు.

పాఠశాలలో కంటి పరీక్షలు

నరసరావుపేట అర్బన్ : పట్టణంలోని కేరిడ్జ్ పాఠశాలలో గురువారం మాక్స్‌విజన్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు డాక్టర్ ఎం.చెంచిరెడ్డి కంటి పరీక్షలు చేశారు. కళ్ల రక్షణకు సూచనలు చేశారు. పాఠశాల ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ నాసరయ్య, ప్రధానోపాధ్యాయుడు బర్నబాస్ తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

విద్యుత్తు శాఖ డీఈగా రామయ్య

పిడుగురాళ్ల : పిడుగురాళ్ల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం. బాబ్జినాయక్ గతవారంలో మృతిచెందటంతో మాచర్ల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ. రామయ్యను పిడుగురాళ్ల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇన్‌ఛార్జిగా నియమించారు.

ఉపాధి అక్రమాలపై విచారణ

రాజుపాలెం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో రాజుపాలెంలో జరిగిన ఉపాధి అక్రమాలపై సీఎంవోకు అందిన ఫిర్యాదును డ్వామా సత్తెనపల్లి ఏపీడీ నారాయణ గురువారం విచారణ చేశారు. అక్రమాలపై ఆధారాలతో ఫిర్యాదు చేసిన శ్రీనివాసమూర్తిని ఏపీడీ కలిసి వివరాలు సేకరించారు. ఉపాధి పనులకు సంబంధించి పాత రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్థలదాతలకు సత్కారం

క్రోసూరు(అచ్చంపేట) న్యూస్‌టుడే: స్థానిక సాయిబాబా దేవాలయం విస్తరణకు 7.50సెంట్లు స్థలాన్ని దానం చేసిన హైదరాబాద్‌లో ఉంటున్న గాదిరాజు రామమోహన్‌రావు కుటుంబ సభ్యులను గురువారం దేవాలయం కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. యార్డు మాజీ ఛైర్మన్ కాశయ్య, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.


స్థలదాతలను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు, నాయకులు గ్రామపెద్దలు,

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? పట్టణంలోని పాతబస్టాండ్ ప్రాంతంలోని జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల వెనుక బజారులో ఆధునిక పరిజ్ఞానంతో నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు వాడుకలోకి తీసుకురావాలి.
- స్థానికులు, పాత బస్టాండ్.

✔ సామాజిక మరుగుదొడ్లను వాడుకలోకి తెచ్చే ఆలోచన చేస్తున్నాం. త్వరలోనే ప్రారంభిస్తాం.

? పట్టణంలోని ఎన్టీఆర్ భవన్ వద్ద నుంచి కృష్ణవేణి జూనియర్ కళాశాల వరకు అంతర్గత రోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలి. **- స్థానికులు, బైపాసు రోడ్డు.**

✔ గుంతలు పడిన చోట ప్యాచ్ వర్క్ చేయిస్తాం. పట్టణమంతా రోడ్లపై పడిన గుంతలు పూడ్చే పనులు త్వరలో చేపట్టబోతున్నాం. **- షమ్మి, మున్సిపల్ కమిషనర్ -న్యూస్‌టుడే, సత్తెనపల్లి**

? మండెపూడిలోని చెరువు వద్ద వ్యర్థాలు వేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం మొత్తం దుర్గంధం వ్యాపిస్తోంది. **- శ్రీనివాసరావు**

✔ సిబ్బందిని పంపి వ్యర్థాలు తొలగించి అక్కడ వేయకుండా చర్యలు తీసుకుంటాం - **బిక్కి సుధాకర్, పంచాయతీ కార్యదర్శి, మండెపూడి -న్యూస్‌టుడే, అమరావతి**

ప్రజలకిచ్చిన హామీలు నెరవేరుస్తాం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సత్తెనపల్లి ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు. దశాబ్దాలుగా సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల ప్రజల్ని వేధిస్తున్న అచ్చంపేట రోడ్డులోని రైల్వేగేటు వద్ద ఆర్వోబీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.57 కోట్ల నిధులు మంజూరైనట్లు గురువారం ఆయన చెప్పారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సహకారంతో కేంద్ర ప్రభుత్వం దృష్టికి రైల్వే గేటు సమస్యను తీసుకెళ్లి శాశ్వత పరిష్కారంగా ఆర్వోబీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు.

వంద రోజుల పనిదినాలు

రెంటచింతల, న్యూస్‌టుడే : క్షేత్ర సహాయకులు వంద రోజుల పాటు పనిదినాలు ప్రతి ఒక్కరికి కల్పించాలని ఎంపీడీవో సరోజినీ దేవి కోరారు. గురువారం ఎంపీపీ కార్యాలయంలో నిర్వహించిన ఉపాధి పథకం సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు కూడా 100 రోజుల పనిదినాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

గూడు గోడు తీరేనా?

పక్కా ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా దక్కని హక్కులు

క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూపులు

దశాబ్దాలుగా ఆ కుటుంబాలు పక్కా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నా వారి గృహాలపై వారికి హక్కులు లేవు. మౌలిక వసతుల కల్పనను అడిగే పరిస్థితి లేదు. వందల్లో ఏర్పాటైన కుటుంబాలకు మున్సిపాలిటీ మౌలిక వసతులను కల్పించి ఆస్తి పన్ను లాంటివి వసూలు చేస్తున్నా హక్కులు దక్కని దుస్థితి నెలకొంది. సత్తెనపల్లి పట్టణంలో వందలాది కుటుంబాలకు ఈ సమస్య ఉంది. దీని పరిష్కారానికి అల్పాదాయ కుటుంబాలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలోనైనా దృష్టి సారించాలని కోరుకుంటున్నాయి.

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

యడ్లపాడు మండలంలోని సొలస గ్రామంలోని రంగనాయకస్వామి ఆలయానికి సత్తెనపల్లి పట్టణంలోని సర్వే నెంబరు 20లో 7 ఎకరాల 82 సెంట్ల భూమిని స్థానిక దాతలు విరాళంగా ఇచ్చారు. పూర్వం వ్యవసాయ భూములుగా ఉన్న అవి కాస్తా నివాసయోగ్యంగా మారి 500 కుటుంబాలు అయిదు దశాబ్దాలుగా నివసిస్తున్నాయి. తమ ఇళ్లను క్రమబద్ధీకరిస్తే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నగదు చెల్లిస్తామని ఇక్కడి కుటుంబాలు ముందుకొచ్చాయి. 2003లో త్రిమెన్ కమిటీ నివేదిక మేరకు క్రమబద్ధీకరణ దశ చివరకు చేరింది. ఉత్తర్వులు వెలువడాల్సిన సమయంలో పాలకులు శ్రద్ధ చూపించకపోవడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. 2014లో హైకోర్టు జోక్యంతో ప్రతిపాదనలు ఆగిపోయాయి. గత తెదేపా ప్రభుత్వం విశాఖపట్నంలో సింహాద్రి అప్పన్న భూముల్లో ఉన్న ఇళ్లను క్రమబద్ధీకరించే మార్గం వేసింది.


క్రమబద్ధీకరణకు నోచుకోని పాతబస్టాండ్ ప్రాంతంలోని పక్కా ఇళ్లు

ఈ ఆలయానికి కూడా ఆదాయం లేని పక్షంలో క్రమబద్ధీకరణకు అంగీకారం తెలిపి దేవస్థానాన్ని అభివృద్ధి చేసుకోవాలని రంగనాయస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ భావిస్తోంది. అయితే క్రమబద్ధీకరణకే గత ప్రభుత్వం శ్రద్ధ చూపించలేదు. ప్రభుత్వం మళ్లీ ఆ భూములను స్వాధీనం చేసుకునేందుకు కూడా అవకాశం లేకుండా పక్కా ఇళ్లు, రోడ్లు, తాగునీరు, విద్యుత్తు, ఇతర మౌలిక వసతుల కల్పన పనులు పూర్తయి ఉన్నాయి. క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపడితే అటు ప్రజలకు.. ఇటు దేవాలయానికి ఉభయతారకంగా ఉండే అవకాశముంది. క్రమబద్ధీకరిస్తే గూడుపై శాశ్వత హక్కు లభిస్తుందని ఎంతో కాలంగా స్థానికులు ఎదురుచూస్తున్నారు.

ఉన్నతస్థాయిలో నిర్ణయం తీసుకోవాలి

పట్టణంలోని 21వ వార్డు పరిధిలోని సర్వే నంబరు 187లో జిల్లా పరిషత్తుకు చెందిన 4 ఎకరాల 93 సెంట్ల భూమి ఉంది. గతంలో జడ్పీ, పంచాయతీ పర్యవేక్షణలో ఈ వ్యవసాయ భూమి ఉండేది. ప్రస్తుతం అది నివాసయోగ్యంగా మారి సుమారు 250 కుటుంబాలు గత 50 ఏళ్లుగా నివసిస్తున్నాయి. వీటి క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయాలనే ఆలోచన కూడా కాగితాలకే పరిమితమవుతోంది. గత ప్రభుత్వం జడ్పీ అంగీకారంతో రాష్ట్ర ప్రభుత్వ ఆమోదముద్ర కోసం దస్త్రం పంపినా ఉత్తర్వులు వెలువడలేదు. క్రమబద్ధీకరణకు జిల్లా పరిషత్తు అంగీకారం తెలిపిన నేపథ్యంలో ప్రభుత్వంలో ఉన్నత స్థాయిలో నిర్ణయం తీసుకుంటే పేద, మధ్యతరగతి కుటుంబాలకు మేలు జరిగే అవకాశముంది.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, బెల్లంకొండ, క్రోసూరు(అచ్చంపేట) వెల్దుర్తి, మాచర్ల (కారంపూడి)పిడుగురాళ్ల, దుర్గి, పాడపాడు(పెదకూరపాడు) న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రాకతో గ్రామాలకు మంచి రోజులు వచ్చాయంటూ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారయణ పేర్కొన్నారు. నకరికల్లు మండలంలోని రూపెనగుంటకు రూ.15 లక్షలు, దేచవరం రూ.20లక్షలు, కండ్లగుంట రూ.16లక్షలు, చీమలమర్రి రూ.10లక్షలతో గ్రామాలలో చేపట్టిన సీసీ రోడ్డుకు, మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు పల్లె పండుగ కార్యక్రమంలో ఆయన శంకుస్థాపన చేశారు. సాగి శ్రీను, కె.గోపి, కోటేశ్వరావు, పరమేశ్వరావు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. పల్లె పండగ కార్యక్రమంతో గ్రామీణ పల్లె ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శ్రీకారం చుట్టారని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పిఎస్కే మస్తాన్ షరీఫ్ అన్నారు. బెల్లంకొండ మండలంలోని పాపాయపాలెం, వెంకటాయపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సహకారంతో బీసీ కాలనీలో రూ.20 లక్షలు, ఎస్టీ కాలనీలో 20 లక్షల రూపాయలతో నూతన సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. క్రోసూరు మండలం నాగవరంలో ఉపాధిహామీ నిధులతో చేపట్టే పశువుల షెడ్డు నిర్మాణానికి జనసేన నియోజకవర్గ సమన్వయకర్త వై. రామకృష్ణ భూమి పూజ చేశారు. పంచాయతీరాజ్ ఏఈ శివయ్య ఆధ్వర్యంలో వెల్దుర్తిలో సర్పంచి జువ్వా శంకర్ రెండు పశువుల షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మాచర్ల మండలంలోని కొత్తూరు, పశువేముల గ్రామాల్లో గురువారం పల్లెపండగ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఫణికుమార్ చేపట్టారు. కొత్తూరులో రూ. 5 లక్షలు, పశువైములలో రూ. 10 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లకు, రూ. 2.30 లక్షలతో నిర్మిస్తున్న మేకల షెడ్డుకు భూమి పూజ చేశారు. కోనంకి, పాతగణేశునిపాడు గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, మురుగునీరు పారుదల కాల్వలు, గోకులాలు నిర్మాణాలకు ఎంపీడీవో రామచంద్రయ్య, పీఆర్ఏఈ శ్రీనివాసరెడ్డి, ఏపీవో మేరిగ్రేస్ భూమి పూజ చేశారు. దుర్గి మండలంలోని నెహ్రూనగర్ తండా, మంగాపురంతండా, కంచరగుంట గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ20 లక్షలతో నిర్మాణాలు చేపట్టనున్న సీసీ రోడ్లు నిర్మాణాలకు గురువారం జడ్పీటీసీ సభ్యులు శెట్టిపల్లి యల్లమంద, తెదేపా మండల నాయకులు దుర్గెంపూడి జానకి రమణ, జనసేన నాయకుడు తోటకూర శ్రీనివాసరావు భూమిపూజ చేశారు. గ్రామీణ రహదారుల నిర్మాణాలను వచ్చే జనవరినాటికి పూర్తి చేస్తామని జిల్లా తెదేపా కార్యదర్శి అర్తిమళ్ల రమేష్ అన్నారు. పాడపాడు గ్రామంలో సీపీ రహదారుల నిర్మాణానికి ఆయన కూటమి నేతలు, అధికారులతో కలసి శంకుస్థాపన చేశారు.


నెహ్రూగర్ తండాలో సీసీరోడ్డుకు శంకుస్థాపన చేసిన తెదేపా నాయకులు

సమస్యలపై ఆర్డీవోకు రైతుల వినతి

దాచేపల్లి న్యూస్‌టుడే: చెట్టినాడు సిమెంట్ కర్మాగారం పరిధిలోని పెద్దగార్లపాడు, తక్కెళ్లపాడు, కేసానుపల్లి గ్రామాల రైతులు తమకున్న సమస్యలపై ఆర్డీవోకు వినతి పత్రాలు అందజేశారు. గురువారం చెట్టినాడు సిమెంట్ కర్మాగారానికి వచ్చిన ఆర్డీవో వి. మురళీకృష్ణను రైతులు కలిశారు. కలెక్టర్ కార్యాలయంలో గతంలో రైతులు ఇచ్చిన ఫిర్యాదులపై విచారణపై ఆర్డీవో ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా వారిని కలిసిన రైతులు మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తికాగనే తమ పిల్లలకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని గతంలో ఫ్యాక్టరీ యాజమాన్యం హామీ ఇచ్చి మా వద్ద నుంచి తక్కువ రేటుకు మా భూములను కొనుగోలు చేసిందని, ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేసి ఐదు సంవత్సరాలు గడుస్తున్నా తమ పిల్లలకు ఉద్యోగాలు కల్పించకుండా బయటి వ్యక్తులను ఉద్యోగాలు ఇచ్చి మమ్మల్ని మోసం చేశారన్నారు. వీటిపై విచారణ చేయించి తమ సమస్యలు తీర్చాలని ఆర్డీవోను కోరారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేస్తామని రైతులకు రైతులకు ఆర్డీవో హామీ ఇచ్చారు.


రైతులు, ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడుతున్న ఆర్డీవో మురళీకృష్ణ

నేటి నుంచి గ్రామసభలు

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే : మండలంలో సమగ్ర భూమి రీ-సర్వే పూర్తయిన నాలుగు గ్రామాల పరిధిలో అడంగల్‌లో మార్పులు, చేర్పులు, ఇతర సమస్యల పరిష్కారానికి 18 నుంచి 23 వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు కె.ఎస్. చక్రవర్తి తెలిపారు. సమస్యలపై పట్టాదారుల నుంచి అర్జీలను స్వీకరిస్తామన్నారు. దస్త్రాల ఆధారంగా వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. 18న కంటెపూడి, 19 భీమవరం, 22న గోరంట్ల, 23వ తేదీన రెంటపాళ్లలో గ్రామసభలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

పెదకూరపాడు, న్యూస్‌టుడే : నేటి నుంచి పెదకూరపాడు మండల పరిధిలోని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు పెదకూరపాడు తహసీల్దారు దానియేలు గురువారం ఒక ప్రకటలో తెలిపారు.

నాణ్యమైన విద్యుత్తు అందించాలి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే : వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేయాలని విద్యుత్తుశాఖ ఎస్ఈ పి. విజయ్‌కుమార్ చెప్పారు. గురువారం పట్టణంలోని గుంటూరు రోడ్డులోని విద్యుత్తు సబ్‌డివిజన్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్రేక్ డౌన్స్ ఎక్కువ అవుతున్న నేపథ్యంలో వాటిని తగ్గించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వసూలు చేయాలని చెప్పారు. డివిజన్ పరిధిలోని ఏఈలు హాజరయ్యారు.

ప్రభుత్వ ధరలకే మద్యం అమ్మాలి

మాచర్ల (కారంపూడి) ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే మద్యం అమ్మకాలు జరపాలని జనసేన పార్టీ నియోజకవర్గ బాధ్యుడు రామాంజనేయులు తెలిపారు. కొత్త మద్యం పాలసీలో వ్యాపారులు సిండికేట్లుగా ఏర్పడి మద్యం ధరలు పెంచి అమ్మకాలు చేస్తే జనసేన అడ్డుకుంటుందని తెలిపారు.

మున్సిపల్ కార్యాలయంలో ట్యాంకర్‌తోనే నీటి అవసరాలు


మున్సిపల్ కార్యాలయ ట్యాంకుకు ట్యాంకర్ నీటిని ఎక్కించే చర్యలు

మున్సిపల్ కార్యాలయానికి తాగునీరు అందించే పైపులైన్లు పాడై ఏడాదిన్నర దాటింది. అవి నిర్మించాలంటే రోడ్డు పగలగొట్టాల్సిన పరిస్థితి. దీంతో రోజూ మున్సిపల్ ట్యాంకర్ నీటిని కార్యాలయ ట్యాంక్‌కు ఎక్కించి నీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన జీఐ పైపులు రోడ్ల నిర్మాణ సమయంలో పగిలిపోయాయి. రాజీవ్‌గాంధీ కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు నూతన పైపులైన్ల నిర్మాణం చేపడితే రోజూ ట్యాంకర్ నీటిపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. కౌన్సిల్‌లో చర్చించి త్వరలోనే శాశ్వత పైపులైన్ల నిర్మాణ పనులు చేపడతామని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. –న్యూస్‌టుడే, సత్తెనపల్లి

డీఆర్‌యూసీసీ సభ్యుడిగా సాంబశివరావు



సత్తెనపల్లి, న్యూస్‌టుడే: గుంటూరు రైల్వే డివిజన్ డివిజనల్ రైల్వే వినియోగదారుల కన్సల్టేటివ్ కమిటీ(డీఆర్‌యుసీసీ) సభ్యుడిగా స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చలంచర్ల సాంబశివరావు నియమితులయ్యారు. ఈ మేరకు రైల్వేశాఖ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.కమలాకరబాబు నుంచి గురువారం నియామక పత్రాన్ని అందుకున్నారు. రైల్వే వినియోగదారుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా సాంబశివరావు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయ రైతులే భవిష్యత్తు శాస్త్రవేత్తలు

అమరావతి, న్యూస్‌టుడే : రసాయనిక వ్యవసాయ పద్ధతుల నుంచి మారి భవిష్యత్తు తరాల ఆరోగ్యం కోసం ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లిన రైతులే భవిష్యత్తులో రైతు శాస్త్రవేత్తలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి అన్నారు. గురువారం మండల పరిధిలోని అత్తలూరులో విదేశీ బృందానికి ప్రకృతి వ్యవసాయంలో సాగవుతున్న పంట పొలాలను చూపించి సాగు పద్ధతులు వివరించారు. సేంద్రియ విధానంలో సాగు చేసి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందడమే కాకుండా భూమితో పాటు అనేక జీవరాశులను కాపాడుకోవడంలో రైతులు కృషి ఉందన్నారు. స్కాట్లాండ్ దేశంలోని ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయానికి చెందిన హేసేనీ సాతిరాజ్ సారథ్యంలోని విదేశీ బృందం ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి వాటి సాగు పద్ధతులు తెలుకొని వీడియోలో చిత్రీకరించుకున్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు ప్రపంచం మొత్తం చూస్తుందని వారు పేర్కొన్నారు. ఉదయ్, మధుబాబు, కవిత తదితరులు పాల్గొన్నారు.


పసుపు పంటను పరిశీలిస్తున్న డీపీఎం అమలకుమారి

లైమ్‌సిటీలో వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేస్తాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, సత్తెనపల్లి, మాచవరం, దాచేపల్లి, మాచర్ల (కారంపూడి), రెంటచింతల, దుర్గి, న్యూస్‌టుడే : లైమ్‌సిటీలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని వచ్చే జయంతి కల్లా ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెప్పారు. గురువారం రాత్రి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు, వాల్మీకి చిత్రపటానికి ఎమ్మెల్యే యరపతినేని పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగ ప్రకటించి బోయలకు కానుకగా ఇచ్చిందని చెప్పారు. బోయ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. వాల్మీకి మహర్షి జీవితం అందరికి ఆదర్శప్రాయమని, నేటితరం పిల్లలకు వాల్మీకి స్ఫూర్తిని తెలియజేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 12వ వార్డులో కూటమి పార్టీల ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన వాల్మీకి జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వాల్మీకి మహర్షి జయంతి మాచవరం మండలంలోని పిన్నెల్లి, చెన్నాయపాలెం, పిల్లుట్ల, మోర్జంపాడు గ్రామాల్లో నిర్వహించారు. ఆయా చోట్ల బోయ సామాజిక వర్గీయులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. దాచేపల్లి మండలంలోని గామాలపాడు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. మాచర్ల మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వాల్మీకి మహర్షి జయంతి వేడుక రెంటచింతలలో ఘనంగా జరిగింది. దుర్గి జడ్పీ పాఠశాలలో వాల్మీకి చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రం

దాచేపల్లి న్యూస్‌టుడే: దాచేపల్లి పట్టణంలోని స్థానిక ప్రియదర్శిని లాడ్జి సమీపంలో యూటీఎఫ్ కార్యాలయంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఉచిత ఓటరు నమోదు కేంద్రాన్ని జిల్లా యూటీఎఫ్ నాయకులు గురువారం ప్రారంభించారు. జిల్లా యూటీఎఫ్ కార్యదర్శి వి. నాగేశ్వరావు మాట్లాడుతూ మార్చిలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హత కలిగి ఇంకా నమోదు చేసుకోని వారి కోసం ఉచితంగా ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

వాలీబాల్ జిల్లా జట్టుకు ఎపిక

పెదకూరపాడు, న్యూస్‌టుడే: స్థానిక జీఆర్‌సీ ఆర్‌కే శ్రీచైతన్య పాఠశాల క్రీడాకారులు వాలీబాల్ క్రీడలో ప్రతిభ చాటి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. వేజెండ్లలో గురువారం నిర్వహించిన అండర్17 బాలురు విభాగంలో వేముల జశ్వంత్, వేముల ప్రదీప్, దూడల బ్రహ్మం, అనుమాల వరుణ్‌కుమార్, అండర్17 బాలికల విభాగంలో సాధినేని నేహ, అవ్వారి దుర్గాక్షర ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ గుత్తా కవిత తెపారు.

విద్యార్థులకు అభినందనలు

మాచర్ల (కారంపూడి), సాఫ్ట్‌బాల్ క్రీడలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు జాతీయ స్థాయిలో తృతీయ స్థానం రావటంలో ముఖ్య భూమిక వహించిన స్థానిక సెయింటాన్స్ పాఠశాల విద్యార్థి ఆలేటి కార్తీక్, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన గణేష్‌ను గురువారం పాఠశాల సిబ్బంది అభినందించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. 'సమస్యల వలయంలో సత్తెనపల్లి' శీర్షికన గురువారం 'ఈనాడు' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి కమిషనర్ షమ్మి స్పందించారు. ముస్లింపేటలో షాదీఖానాతో పాటు రంగా కాలనీ, అంబేడ్కర్ నగర్, అచ్చంపేట రోడ్డులో పారిశుద్ధ్య నిర్వహణ చర్యలు చేపట్టారు. శాశ్వత అంతర్గత రోడ్ల నిర్మాణాన్ని మున్సిపల్, ఆర్థిక సంఘం నిధులతో చేపట్టబోతున్నట్లు ఆయన తెలిపారు. తాగునీటికి ఎక్కడా ఇబ్బంది లేకుండా ఇంటింటికి, పైపులైన్లులేని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 నియోజకవర్గ స్థాయి బాలికల బ్యాడ్మింటన్ పోటీల్లో స్థానిక హోలీ ఫ్యామిలీ పాఠశాల విద్యార్థినులు గుంజి బాలసమీక్ష, ముళ్లమూరి ఐశ్వర్య జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని పాఠశాల బాధ్యులు సిస్టర్ విజయరాణి, అచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

హుండీల లెక్కింపు

రెంటచింతల, న్యూస్‌టుడే : మండలంలోని రెండు ఆలయాల్లో గురువారం హుండీ లెక్కించినట్లు ఈవో రామిరెడ్డి తెలిపారు. సత్రశాలలో రూ. 37,713లు, రెంటచింతల శివాలయంలో రూ. 4,894లతో కలిపి రూ. 42,607 ఆదాయం దేవాదాయశాఖకు జమైనట్లు వెల్లడించారు.


షాదీఖానా పక్కన రోడ్డులో వర్షపునీరు

బెల్లంకొండ డొంక రోడ్డు నిర్మించండి

పిడుగురాళ్ల.న్యూస్‌టుడే : పట్టణంలోని బెల్లంకొండ డొంక రోడ్డు షాదీఖానా వద్ద నుంచి శివారెడ్డి ఆసుపత్రి అడ్డ రోడ్డు వరకు అధ్వానంగా తయారైంది. దశాబ్దకాలం క్రితం తాగునీటి పైపులైను వేయటానికి సిమెంట్ రోడ్డు ధ్వంసం చేశారు. అవి వేసిన తరువాత పైపైన మట్టితో పూడ్చారు. ఆ రోడ్డు మొత్తం ఎత్తుపల్లంగా తయారై వర్షం కురిస్తే నీరు రహదారి పైనే నిలుస్తుందని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. గత వైకాపా పాలనలో మున్సిపాలిటీలో రోడ్ల నిర్మాణంపై దృష్టి పెట్టలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా గంగామహాల్ ప్రాంతంలో మూడు రోడ్ల నిర్మిస్తారని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అడ్డదిడ్డంగా వాహనాలు: పిల్లుట్ల రోడ్డులో ఆటోలు అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. ఈ కారణంగా వాహనాలకు అంతరాయం కల్గుతోంది. ఒక వరస క్రమంలో ఆటోలు ఏర్పాటు చేస్తే, అటువైపు వెళ్లే వాహనాలకు ఎలాంటి అసౌకర్యం ఉండదు. పోలీసులు వచ్చినప్పుడు మాత్రం పక్కకు ఆటోలు పెడుతున్నారు. వారు వెళ్లిన తరువాత రోడ్డుపై అడ్డదిడ్డంగా ఆటోలు నిలిపి అటు వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు కల్గిస్తున్నారు.


ఎమ్మెల్యే కన్నాను విమర్శిస్తే సహించేది లేదు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను, కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాల్జేయాలని చూస్తే సహించేది లేదని తెదేపా జిల్లా అధికార ప్రతినిధులు కంబాల వెంకటేశ్వరరావు, ఆళ్ల సాంబయ్య, పూజల వెంకటకోటయ్య, దివ్వెల శ్రీనివాసరావు వైకాపా శ్రేణులకు హెచ్చరించారు. పట్టణంలోని రఘురామ్ నగర్‌లోని తెదేపా ప్రజా వేదికలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి కోసం కన్నా కష్టపడుతున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక వైకాపా నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు.

బీసీలకు రక్షణ చట్టం ఆయుధం లాంటిది

పెదకూరపాడు, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో బీసీలపై నిత్యం దాడులకు దౌర్జన్యాలు, హింసాత్మకమైన సంఘటనలకు గురయ్యారని తెదేపా బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ అన్నారు. గురువారం ఆయన పెదకూరపాడులో మాట్లాడుతూ బీసీలను అణచివేయడమే లక్ష్యంగా జగన్‌రెడ్డి పాలన సాగిందన్నారు. అనేకమంది బీసీ నేతలను హత్య చేశారని, కొన్ని వేల మంది బీసీలపై దాడులకు పాల్పడి, వారిపై తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురిచేశారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీలకు రక్షణ చట్టం కల్పిస్తామని ప్రకటించడం హర్షణీయమని ఆయన పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


నాగేశ్వరరావు పాత చిత్రం

దాచేపల్లి, కారంపూడి న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. దాచేపల్లి పట్టణానికి చెందిన జాల నాగేశ్వరరావు (42) ఫైబర్ నేట్‌లో పని చేస్తు జీవనం సాగిస్తున్నాడు. కారంపూడి మండలం బట్టువారిపల్లెలో ఓ ఇంట్లో నెట్ సర్వీస్ కనెక్షన్ రావడంలేదని పరిశీలించి రావాలని తన యజమాని తెలిపాడు. నాగేశ్వరరావు బట్టువారిపల్లె గ్రామానికి వెళ్లి నెట్ సర్వీస్‌కు సంబంధించిన తీగల మరమ్మతుల కోసమని ఓ విద్యుత్ స్తంభం పైకి ఎక్కాడు. మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతిడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సెల్‌టవర్ కేంద్రంలో బ్యాటరీలు చోరీ

పెదకూరపాడు, న్యూస్‌టుడే : సెల్‌టవర్ కేంద్రంలో బ్యాటరీలు చోరీ చేసిన దొంగలను గంటల వ్యవధిలో పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై గిరిబాబు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని జలాల్‌పురంలోని ఎయిర్‌టెల్ టవర్‌లోని 24 బ్యాటరీలను బుధవారం తెల్లవారుజామున దొంగలు చోరీ చేశారు. సెల్‌టవర్ కంపెనీ సూపర్‌వైజర్ బాజీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విలాసాలకు అలవాటు పడి చోరీలు చేస్తున్న గుంటూరు నగరానికి చెందిన దడిగి మణికంఠ, పెదనందిపాడు మండలంలోని పుసులూరుకు చెందిన బిల్లా వెంకటేశ్, దక్కుమల్ల ధనరాజును గురువారం అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను సత్తెనపల్లి కోర్టులో హాజరుపర్చగా 14 రోజులపాటు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

నకరికల్లు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన అద్దంకి నార్కెట్‌పల్లి జాతీయ రహదారిపై నకరికల్లు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు నర్సింగపాడుకు చెందిన పుల్లంశెట్టి సుబ్బయ్య, నకరికల్లుకు చెందిన ఫణీంద్రరెడ్డి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా నకరికల్లు సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించి నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యంపై కేసు

ముప్పాళ్ల, న్యూస్‌టుడే : మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత బుధవారం రాత్రి ఇంటి నుంచి అదృశ్యమైంది. ఈ ఘటనపై భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సోమేశ్వరరావు తెలిపారు.

చేతుల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవు


మాట్లాడుతున్న ఆరోగ్య విస్తరణాధికారి శ్యాంసన్

క్రోసూరు(అచ్చంపేట) న్యూస్‌టుడే: చేతుల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని స్థానిక పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి శ్యాంసన్ అన్నారు. గురువారం ఆయన క్రోసూరు మండలం దొడ్లేరు1 సచివాలయం వద్ద చేతుల పరిశుభ్రత అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. మంచి ఆరోగ్యం పొందడంలో చేతుల పరిశుభ్రత కీలక పాత్ర పోషిస్తుందన్నారు.